

రేపల్లె: ఓలేరుపల్లెపాలెం వద్ద ఇసుకబస్తాలతో పటిష్టపరిచిన కరకట్ట(ఫైల్)



ఓలేరుపల్లెపాలెంవద్ద కృష్ణానది కరకట్టకు గండిపడిన ప్రాంతం (ఫైల్)

వేతన వెతలు



- నీరుగారుతున్న ఉపాధి హామీ పథకం లక్ష్యం
- కూలీల వేతనాలు రూ.51.37 కోట్లు
- మెటీరియల్ బకాయిలు రూ.154.46 కోట్లు
- మూడు నెలలుగా నిలిచిపోయిన చెల్లింపులు
- ఆర్థిక ఇక్కట్లతో కష్టజీవుల ఎదురు చూపు
- బిల్లులు మంజూరు కాక నిలిచిన పనులు
- చోద్యం చూస్తున్న పాలకులు

ఉపాధి వేతనం చెల్లింపులు సకాలంలో జరగడంలేదు. నెలల తరబడి వేతనాలు నిలిచిపోతున్నాయి. చేసిన పనికి సొమ్ములు అందక కార్మికులు తీవ్ర ఆర్థిక ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. 90 రోజులుగా వేతన చెల్లింపులు నిలిచిపోయాయి. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో రూ.51.37 కోట్లు వేతన బకాయిలు పేరుకుపోయాయి. వేతనం ఇప్పించాలన్న కూలీల మొర ఆలకించే నాథుడే కరువయ్యారు. పరిస్థితి తీవ్రంగా ఉన్నా పాలకులు చోద్యం చూస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఉపాధి కూలీలు చేసిన పనికి వేతనం కోసం పాస్ పుస్తకాలు చేతపట్టుకొని బ్యాంకుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతు న్నారు. ఖాతాలు ఖాళీగా కనిపించడంతో నిరాశకు లోన వుతున్నారు. ఉపాధి కార్యాలయాలకు వెళితే.. వేతనం రేపో మాపో బ్యాంకు ఖాతాకు జమ అవుతుందని అధికారులు చెప్పి పంపించేస్తున్నారు. జనవరి 15 నుంచి ఇప్పటి వరకు పనులు చేసిన కూలీలకు ఉపాధి సొమ్ము చెల్లించలేకపోవడంతో వారి పరిస్థితి దయనీయంగా మారింది. పనులకు సంబంధించిన సామగ్రి బిల్లుల బకా యిలు రూ.154.46 కోట్లు పేరుకుపోయాయి. ప్రతివారం క్షేత్రస్థాయి సిబ్బంది కార్మికుల వారీగా వేతనం వివరాలను మండల కార్యాలయానికి పంపిస్తారు. వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసిన రెండు రోజులకు కూలీల ఖాతాల్లో నగదు జమ చేయాలి. కానీ, మూడు నెలల నుంచి వేతనాలు చెల్లించట్లేదని ఉపాధి కూలీలు వాపోతున్నారు.

నీరుగారుతున్న ఉపాధి లక్ష్యం

వలసల నివారణకు, వ్యవసాయ, కార్మిక కూలీలకు పనులు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లక్ష్యం అమలులో నీరుగారిపోతోంది. చేసిన పనికి రెండు రోజుల్లో ప్రతి కూలీకి సొమ్ము వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాకు జమ చేయాలి. అయితే వేతనాలు చెల్లింపుల్లో నిర్లక్ష్యం తాండవిస్తోందని కూలీలు వాపోతున్నారు. వెనువెంటనే కూలి రాకపోవడంతో ఉపాధి పనుల పట్ల కూలీలు ఆసక్తి కనబరచడంలేదు. పల్నాడు జిల్లాలో రూ.19.86 కోట్లు, గుంటూరు జిల్లాలో రూ.8.69 కోట్లు, బాపట్ల జిల్లాలో రూ 22.82 కోట్లు వేతన బకాయిలు ఉన్నాయి.

విముఖత చూపుతున్న కూలీలు

ప్రభుత్వం ఉపాధి కూలీకి కనీస రోజు వేతనం రూ.307గా నిర్ణయించింది. ఈ మేరకు వేతనం కూలీలకు లభించడంలేదు. వ్యక్తిగత పని దినాలు కల్పించడంలో యంత్రాంగం అలసత్వం వహిస్తుందన్న ఆరోపణలు న్నాయి. పల్నాడు జిల్లాలో అత్యధికంగా 5.77 లక్షల జాబ్ కార్డులు నమోదు చేశారు. గుంటూరు జిల్లాలో 2.09 లక్షలు, బాపట్ల జిల్లాలో 4.72 లక్షల జాబ్ కార్డులున్నాయి. నమోదు చేసుకున్నవారందరూ పనులకు హాజరు కావడంలేదు. పల్నాడులో 4.53 లక్షలు, బాపట్ల లో 3.74 లక్షలు, గుంటూరులో 1.51 లక్షల కార్డులు యాక్టివ్‌గా ఉన్నాయి. వీరు మాత్రమే ఉపాధి పనులకు హాజరవుతున్నారు. పేరు నమోదు చేసుకుని, పనులకు హాజరు కాని కూలీల సంఖ్యలో లక్షల్లో ఉండటం గమనార్హం. వెనువెంటనే వేతనం చెల్లించి ఆదుకోవాలని ఉపాధి కూలీలు అధికారులను కోరుతున్నారు.

వేసవి భత్యాలు రద్దు

గతంలో వేసవిలో ఉపాధి పనులు చేసే వారికి ఫిబ్రవరిలో 20శాతం, మార్చిలో 25, ఏప్రిల్‌లో 30 శాతం అదనపు వేతనం ఇచ్చేవారు. మూడేళ్లుగా దీనిని తొలగించారు. వీటితో పాటు పార, గడ్డపార, తాగునీరు, మజ్జిగకు సంబంధించి అదనపు భత్యం ఉండేది. గతంలో మాదిరిగా పని ప్రదేశాల్లో నీడ కోసం టెంట్లు, గాయాలైతే ప్రాథమిక చికిత్స బాక్స్‌లు ఏర్పాటు చేయాలని కూలీలు కోరుతున్నారు. వేసవి భత్యం, సౌకర్యాలు సమకూర్చ డంతో పాటు సకాలంలో వేతనం చెల్లిస్తే పనుల్లోకి వచ్చే వేతనదారుల సంఖ్య పెరుగుతుందంటున్నారు.

బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యం

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రహదారులు, మురుగు కాల్వలు, పాఠశాలల ప్రహరీల నిర్మాణం పనులు చేపట్టారు. వీటితో పాటు గోకులం షెడ్లు తదితర పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపులు స్తంభించి పోయాయి. పూర్తయిన పనులకు నెలలు తరబడి బిల్లులు ఆగిపోయాయి. పల్లె పండుగ పథకం ప్రారంభంలో మొదటి రెండు వారాలు బిల్లుల చెల్లింపులు సక్రమంగా జరిగాయి. అనంతరం చెల్లింపులు నిలిపోవడంతో పనులూ ఆగిపోయాయి. పల్నాడు జిల్లాలో 80.49 కోట్లు, బాపట్ల జిల్లాలో రూ.58.18 కోట్లు, గుంటూరు జిల్లాలో రూ.15.79 కోట్లు బిల్లులు చెల్లించాలి. కమిటీల పర్యవేక్షణలో చేపట్టిన పనులకు బిల్లుల చెల్లింపులు జాప్యం జరుగుతుండటంతో నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- బలహీనంగా కృష్ణానది కరకట్టలు
- ప్రకాశం బ్యారేజీకి దిగువన మరింత ప్రమాదకరం
- ఎగువన పటిష్టతకు రూ. 1100 కోట్ల నిధులు
- వరదలొస్తే దిగువ కరకట్టకు ఎక్కడ గండ్లు పడేనో?
- భయం గుప్పిట్లో కృష్ణా తీర గ్రామాలు
- గతేడాది వరదలకు వణికిపోయిన గ్రామాలు
- రూ. 2 వేల కోట్లతో ప్రతిపాదనలు పంపిన ఆర్‌సీ
- నదీ తీరం వెంబడి ఉన్న నలుగురు మంత్రులపైనే ఆశ

దిగువన దిగులు



కొల్లూరు-ఈపూరు మధ్య సింగిల్ రోడ్డుగా ఉన్న కరకట్ట కోతపడి ప్రమాదకరంగా మారిన చిత్రం

తెనాలి, రేపల్లె, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కృష్ణా నదికి వరదొచ్చిందంటే తీరంలో ప్రకాశం బ్యారేజీకి దిగువన ఉన్న గ్రామాలు వణికి పోతుంటాయి. బ్యారేజీ దిగువన కర కట్ట సీతానగరం నుంచి నది సముద్రంలో కలిసే ప్రదేశం లంకెవానిదిబ్బ వరకు 86 కి.మీటర్లు విస్తరించి ఉంది. కృష్ణా నదికి వరదలు వచ్చినప్పుడు ఈ కరకట్ట వెంబడి ఉన్న గ్రామాల ప్రజలు ప్రాణాలు గుప్పిట పట్టి బిక్కుబిక్కుమంటూ గడపాల్సిందే. అయితే, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కృష్ణా ఎగువ భాగాన కుడి కరక ట్టను విస్తరించి, నాలుగు లేన్ల రహదారిని నిర్మించేందుకు నిధులు కూడా మంజూరు చేసింది. ప్రకాశం బ్యారేజీ ఎగువన వైకుంఠపురం వరకు ఉన్న కరకట్టలో 7 కి.మీ టర్ల దూరాన్ని పటిష్టపరచడంతోపాటు, నదిలో గోడ నిర్మాణం కూడా చేసేలా రూ.1,100 కోట్ల నిధులను ప్రభుత్వం కేటాయించింది.

రూ.2వేల కోట్లతో ఆర్‌సీ ప్రతిపాదనలు

ప్రకాశం బ్యారేజీకి దిగువన కృష్ణానది కరక ట్ట పటిష్టతకు ఇంకా మోక్షం లభించలేదు. దిగువ కరకట్టనూ బలపరిచేందుకు ప్రభుత్వానికి నదీ పరివాహక ప్రాంత పరిరక్షణ విభాగం రివర్ కన్జర్వేట రీ(ఆర్.సి) రూ2వేల కోట్లతో ప్రతిపాదనలను ప్రభు త్వానికి తాజాగా పం పింది. ఎగువ కర కట్ట రాజధా ని ప్రాంతానికి ఎంత అవసరమో, దిగువన కరకట్టను పటిష్టపర చడం కూడా అంతే అవసరం ఉంది.

కరకట్ట బలహీనం..గండ్లకు అవకాశం

కృష్ణా నదికి వరదలొచ్చినప్పుడు పొరపాటున కరకట్టకు ఎక్కడైనా గండి పడితే ఏంటి పరిస్థితి!..ఈ మాట తలచుకుంటేనే తీర గ్రామాల ప్రజల వెన్నులో వణుకు పుడుతుంది. దీనికి గత ఓలేరు గండి ఉదంతమే నిదర్శనం. వల్లభాపురం వంటి గ్రామాల దగ్గర్లో గండ్లు పడితే దిగువ గ్రామాల్లో జలప్రళయ తప్పదు. 86 కి.మీటర్ల పొడవునా కరకట్ట పటిష్టంగా లేకపోవడంతో గండ్లు పడ డానికి అనేకచోట్ల సిద్ధంగా ఉంది. గతంలో మొత్తం కుడి కరక ట్టను పటిష్టపరిచి, రోడ్డు నిర్మాణం చేపట్టేలా అప్పటి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రూ. 119 కోట్లు దీనికోసం కేటాయిస్తే, సీతా నగరం నుంచి పెనుమూడి వరకు రూ. 111 కోట్లతో కరకట్టను మట్టితో బలపరచడం, ఉన్న ఎత్తుకంటే మరింత ఎత్తు పెంచడం, కరకట్ట పైభాగం 4 నుంచి 7 అడుగుల వెడల్పు ఉంటే దానిని 12 అడుగులకు పెంచడం వంటి పనులు చేపట్టారు. దీనిపై డ బుల్ రోడ్డు కూడా నిర్మాణం చేశారు. అయితే తాడేపల్లి, విజ యవాడ క్లబ్ దగ్గర కొంత భాగం, పెదకొండూరు - వల్లభా పురం మధ్య, ఈపూరు-కొల్లూరు, దోనేపూడి-పెదపులివర్రు ప్రాంతాల్లో అసలు కరకట్ట పటిష్టపరచలేదు. కొన్నిచోట్ల భూములు ఇవ్వడానికి రైతులు సమ్మతించకపోవడం, మరికొందరు కోర్టును ఆశ్రయించడంతో ఈ ప్రాంతాల్లో కరకట్ట ఆధునికీకరణ జరగలేదు. దీంతో ఇక్కడ కరకట్ట చిక్కి శల్యమైపోయి ఉంటే, చాలాచోట్ల వర్షాలకు కరకట్ట అంచులు కోతపడిపోయి ఉన్నాయి. ఆధునికీకరణ పనులు జరిగిన చోట్ల కూడా కరకట్ట కుంగిపోయి, గతేడాది వచ్చిన వరదలకు అంచుల వరకు నీరు ప్రవహించి, జనానికి దడ పుట్టించింది.

వెంటాడుతున్న గత పీడకలలు

- కృష్ణా నదికి 2009లో వచ్చిన వరదలకు భట్టి ప్రోలు మండలం ఓలేరు దగ్గర కరకట్టకు గండిపడింది. పలు గ్రామాలతోపాటు, రేపల్లె పటణం కూడా వరద నీటిలో చిక్కు కుపోయింది. పట్టణంలోనే పడవలపై ప్రయాణం చెయ్యాల్సి వచ్చింది. గ్రామాల్లో వరద ముంపు వీడడానికి నెలపైనే పట్టింది.
- గతేడాది కృష్ణా నదికి రికార్డు స్థాయిలో 11.36 లక్షల క్యూసెక్కుల వరద నీరు ప్రక వహించింది. దుగ్గిరాల మండలం పెదకొ డూరు నుంచి రేపల్లె మండలం లంకెవాని దిబ్బ వరకు జనం రాత్రులు నిద్రలేకుండా కరకట్టపైనే కాపలకాశారు.
- ఈ వరదలకు వెల్లటూరు-పెనుమూడి మధ్య పలుచోట్ల గండ్లు పడేపరిస్థితి రావ డంతో మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, అధికారులు రాత్రిళ్లు పొక్లెయినర్ల సాయంతో యుద్ధ ప్రాతిపది కన కరకట్టను పటిష్టం చేశారు. దీంతో గండ్లు పడకుండా పెను ప్రమాదాన్ని ఆపగలిగారు.

'త్రి'కరణ శుద్ధిగా మంత్రులు దృష్టి సారించాలి

ఎగువ కరకట్ట అత్యవసర పనులను ప్రభుత్వం ఆమోదిం చి, టెండర్లు పిలవడానికి సిద్ధమైంది. కర కట్ట దిగువనున్న నియోజకవర్గాల్లో కేంద్రమంత్రితో పాటు, ముగ్గురు రాష్ట్ర మంత్రులు ఉన్నారు. వీరు తల చుకుంటే నిధుల మంజూరు పెద్ద సమస్యే కాదు. కృష్ణా నది కరకట్ట తాడేపల్లి నుంచి పెదకోడూరు వరకు మంగళ గిరి ఎమ్మెల్యే, మంత్రి నారా లోకేష్, అక్కడి నుంచి కొల్లిపర మండలం వరకు మంత్రి నాదెండ్ల మనోహర్, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఆ దిగువున మొత్తం రేపల్లె ఎమ్మెల్యే, మంత్రి అనగాని సత్యప్రసాద్ పరిధిలో ఉంది. వీరంతా కీలక మంత్రులే కావడంతో దిగువ కరకట్టకు కూడా ఈ ఏడాదిలో మోక్షం లభిస్తుందన్న ఆశాబావాన్ని నీటిపారుదల శాఖ అధికారులు వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు నదిలోనూ గ్రాయిన్స్ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. దీనికోసం కూడా మంత్రులు శ్రద్ధ చూపితే నదీ పరి వాహక ప్రాంతం సురక్షితంగా ఉంటుంది.

మూడో దశకు మోక్షం

- ఎట్టకేలకు ఇన్నర్‌రింగ్‌రోడ్డు పనులకు శ్రీకారం
- స్వర్ణభారతినగర్‌లో అడ్డుగా ఉన్న 382 ఇళ్ల తొలగింపు
- పెండింగ్ పనులపై కేంద్ర మంత్రి పెమ్మసాని ప్రత్యేక దృష్టి



స్వర్ణభారతి నగర్ వద్ద అడ్డుగా ఉన్న ఇళ్లు తొలగింపు

గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కొన్నేళ్లుగా కదలిక లేని ఇన్నర్ రింగ్ రోడ్డు పనులకు ఎట్టకేలకు మోక్షం లభించింది. గుంటూరు నగరంలో ట్రాఫిక్ ఇక్కట్లకు చెక్ పెట్టేందుకు నగరం చుట్టూ ఇన్నర్ రింగ్ రోడ్డు ఏర్పాటు చేయాలని పదేళ్లుగా చేపడుతున్న ప్రయత్నాలు అరకొరగానే మిగిలిపోతున్నాయి. మొదటి దశలో గడ్డిపాడు నుంచి అమరావతి రోడ్డు వరకు, రెండో దశలో అమరావతి రోడ్డు నుంచి స్వర్ణభారతినగర్ వరకు రోడ్డు ఏర్పాటు చేశారు. మూడో దశ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. స్వర్ణభారతి నగర్ ఆరంభంలో పేదల నివాసాలు ఉన్నాయి. ఆయా ఇళ్ల తొలగింపులో జాప్యం జరుగుతుండటంతో ఇన్నర్‌రింగ్‌రోడ్డు మూడో దశ పనులకు ఇంతకాలం మోక్షం లభించలేదు. ఈ క్రమంలో గత ఎన్నికల్లో గుంటూరు ఎంపీ అభ్యర్థిగా టీడీపీ తరపున పోటీ చేసిన డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఇన్నర్ రింగ్ రోడ్డు మూడో దశ పనులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అందులో భాగంగా ఆయన కేంద్ర సహాయ మంత్రి కావడంతో ఇన్నర్ రింగ్ రోడ్డుపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఇప్పటికే సీఆర్‌డీఏ, కార్పొరేషన్ అధికారులతో చర్చించి యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించాలని ఆదేశించారు. దీంతో ఇన్నర్ రింగ్ రోడ్డు ఫేస్-3 పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. స్వర్ణభారతినగర్ నుంచి పలకలూరు వరకు పనులను చేపట్టారు. గతంలో ఈ రోడ్డు నిర్మాణం కోసం భూసేకరణ చేసి, రైతులకు పరిహారం కూడా అందించారు. అయితే స్వర్ణభారతినగర్ వద్ద ఉన్న ప్రధాన అడ్డంకులు తొలగించలేక పోవడంతో ఈ పనులు ఆగిపోయాయి. తిరిగి పనులను బుధవారం ప్రారంభించారు. ప్రధాన అడ్డంకులను తొలగించి ఈ రోడ్డును స్వర్ణభారతినగర్ పెట్రోల్ బంకు నుంచి పలకలూరు వరకు రోడ్డు ఏర్పాటు చేసేందుకు అధికారులు మార్గం సుగమమం చేశారు. స్వర్ణభారతినగర్ వద్ద ప్రారంభంలో నివాసం ఉంటున్న పేదలకు ప్రత్యామ్నాయంగా స్థలాలను, ఇళ్లను కేటాయించారు. ఈ క్రమంలో స్వర్ణభారతి నగర్ పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న 382 ఇళ్లను నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించారు. వీరందరికీ కూడా నష్టపరిహారం కింద కొంతమేర డబ్బులు చెల్లించారు. మరికొందరికి ప్రత్యా మ్నాయంగా ప్రభుత్వ స్థలాలను, టిడ్కో ఇళ్లను కేటాయించారు. ఈ పరిస్థితుల్లో మూడో దశ పనులు పూర్తి చేస్తే విజయవాడ నుంచి పల్నాడు జిల్లాకు పేరేచర్ల జంక్షన్ నుంచి సులభంగా చేరుకోవచ్చు. దీంతో గుంటూరు నగరంలోకి వచ్చే పని లేకుండా వాహనాలు రింగ్ రోడ్డు గుండా వెళ్లిపోతాయి. దీంతో నగరంలో ట్రాఫిక్ సమస్య క్లియర్ అవుతుంది. రెండు నెలల్లో రోడ్డు పనులు పూర్తి చేసే అవకాశాలు ఉన్నట్లు అధికారులు చెప్తున్నారు.

6

ప్రధాని పర్యటనను విజయవంతం చేయాలి

- 2న అమరావతికి నరేంద్రమోదీ రాక
- శంకుస్థాపనల కంటే ముందు రోడ్ షో
- పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లకు కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశం

రేవులోకి వస్తే.. లేపేస్తాం

- కృష్ణా జిల్లా వాడివి ఎలా వస్తావ్
- గింజుపల్లి రేవులో పడవ పాటదారుడికి బెదిరింపులు
- కలెక్టర్, ఎస్పీ, జడ్పీ అధికారులకు ఫిర్యాదు చేసిన బాధితుడు

హైడ్రో గంజాయి విక్రయిస్తున్న ముఠా అరెస్టు

- రూ.7.5 లక్షల విలువైన గంజాయి స్వాధీనం

ఆర్గానిక్ పంటలకు ప్రోత్సాహం

- ఆర్గానిక్ ప్రొడక్ట్ అథారిటీ చైర్మన్ దేవదత్

పోలీసు, బీవోఐ మధ్య ఒప్పందం

పోలీసులకు శాలరీ అకౌంట్ ప్యాకేజీలతో ప్రయోజనాలు

రూ.2 కోట్ల వ్యక్తిగత ప్రమాద బీమా, రూ.పది లక్షల సైబర్ నేరాల బీమా



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న పోలీసు, బ్యాంకు అధికారులు

మంగళగిరి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పోలీసు ఉద్యోగులకు ప్రత్యేకంగా రూపొందించిన వేతన ఖాతాలకు సంబంధించి బ్యాంక్ ఆఫ్ ఇండియా(బీవోఐ), ఏపీ పోలీసు శాఖ మధ్య అవగాహనా ఒప్పందం కుదిరింది. ఈ మేరకు బుధవారం మంగళగిరిలోని ఏపీ పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో పోలీసు ఉన్నతాధికారులు, బ్యాంకు అధికారులు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా పోలీసు శాఖ ఐజీ రవిప్రకాష్ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది బ్యాంక్ ఆఫ్ ఇండియా అందిస్తున్న వేతన ఖాతాల ప్రయోజనాలను పొందాలని కోరారు. బీవోఐ ఫీల్డ్ జనరల్ మేనేజరు మనోజ్ శ్రీవాత్సవ మాట్లాడుతూ పోలీసుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన శాలరీ అకౌంట్ ప్యాకేజీ ద్వారా గరిష్ఠంగా రూ.2 కోట్ల వరకు వ్యక్తిగత ప్రమాద బీమాతోపాటు సైబర్ నేరాల బీమా గరిష్ఠంగా రూ.పది లక్షల వరకు అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీవోఐ జీఎం ఎంవీవీ బంగార్రాజు, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రాజన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు ఏఎంసీ చైర్‌పర్సన్‌గా అమరేశ్వరి

జనసేన మహిళకు దక్కిన అవకాశం



బొందలపాటి అమరేశ్వరి

ప్రత్తిపాడు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు మా ర్కెట్ యార్డు చైర్‌పర్సన్‌గా గుంటూరు రూరల్ మండలం స్వర్ణ భారతినగర్‌కు చెందిన బొందలపాటి అమరేశ్వరిని ని యమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జనసేన పార్టీ స్వర్ణ భారతినగర్ అధ్యక్షురాలిగా ఉన్న ఆమె గత అ సెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గంలో చురుగ్గా పని చేశారు. ఈ క్రమంలో ఆ పార్టీకి ప్రాధాన్యం కల్పిస్తూ మార్కెట్ యా ర్డు చైర్‌పర్సన్‌గా అవకాశం కల్పించారు. ఆమె నియామ కంపై టీడీపీ, జనసేన నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

తెనాలి సబ్ డివిజన్ పోలీసులకు ప్రతిభా అవార్డు

చేబ్రోలు బాలిక హత్య కేసు చేధించిన సిబ్బందికి డీజీపీ ప్రశంసలు

గుంటూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండల పరిధిలోని కొత్తరెడ్డిపాలెం గ్రామానికి చెందిన బాలిక హత్య కేసు ఛేదించిన తెనాలి సబ్ డివిజన్ పోలీస్ అధికారులు, సిబ్బందిని డీజీపీ హరీష్‌కుమార్ అభినందించారు. నాలుగో త్రైమాసికానికి సంబంధించి బుధవారం మంగళగిరిలోని పోలీ స్ ప్రధాన కార్యాలయంలో విడు దల చేసిన ఏబీసీ అవార్డులలో భాగంగా కన్సోలేషన్ బహుమతిని బాలిక హత్య కేసు ఛేదించినం దుకు తెనాలి పోలీసులు గెలుచుకున్నారు. డీజీపీ హరీష్ కుమార్‌గుప్తా నుంచి వారు ప్రతిభ అవార్డు అందుకున్నారు. జులై 15న జరిగిన బాలిక హత్య కేసును ఎస్పీ సతీష్‌కుమార్ పర్యవేక్షణలో చేబ్రోలు మండలం కొత్తరెడ్డి పాలెంలో తెనాలి సబ్ డివిజన్ డీఎస్పీ జనార్ధన్‌రావు, పొన్నూరు రూరల్ సీఐ కోటేశ్వరరావు, చేబ్రోలు ఎస్ఐ వెంకటకృష్ణ, హెడ్‌కా నిస్టేబుల్ బాలాజీ(ఐటీ కోర్, గుంటూరు), కానిస్టేబుళ్ల అప్పలనాయుడు, నాగరాజులను డీజీపీ అభినందించి వారికి ప్రశంసాపత్రాలను అందజేశారు.



అవార్డు పొందిన పోలీసులతో డీజీపీ హరీష్‌కుమార్‌గుప్తా

గుంటూరులో నకిలీ మిర్చి విత్తనాల డంప్

- పొలాల్లో ప్రాసెసింగ్ చేసి తరలింపునకు సిద్ధం
- చాకచక్యంగా ఛేదించిందిన విజిలెన్స్ అధికారులు



నకిలీ మిర్చి విత్తనాలు స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ సీఐ శివాజీ, ఏవో ఆదినారాయణ

గుంటూరు సిటీ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): నకిలీ మిర్చి విత్తనాల డంప్‌ను గుంటూరు విజిలెన్స్ అధికారులు బుధవారం రాత్రి చాకచక్యంగా ఛేదించారు. గుంటూరు నగరంపాలెం పరిధిలో ఉన్న కొత్తకాలనీ పొలాల్లో నకిలీ మిర్చి విత్తనాల డంప్ దొరికింది. విజిలెన్స్ ఎస్పీ సూర్య శ్రావణ్‌కుమార్‌కు వచ్చిన సమాచారంతో కొత్తకాలనీ పొలాల్లో అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో 20 బస్తాల మిర్చి విత్తనాలు ప్రాసెసింగ్ చేసి ప్యాకెట్లలో నింపి అమ్మకాలకు సిద్ధంగా ఉంచినట్లు గుర్తించారు. మరో 50 బస్తాల మిర్చి విత్తనాలను కూడా అధికారులు గుర్తించారు. విత్తనాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అధికారులు రావడాన్ని గమనించిన నిర్వాహకులు పరారైనట్లు సమాచారం. ఈ దాడుల్లో విజిలెన్స్ సీఐ శివాజీ, ఏవోలు ఆదినారాయణ, రమణకుమార్, కానిస్టేబుల్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్గానిక్ పంటలకు ప్రోత్సాహం

● ఆర్గానిక్ ప్రొడక్ట్ సర్టిఫికేషన్ అథారిటీ రాష్ట్ర చైర్మన్ దేవదత్



సమీక్ష నిర్వహిస్తున్న రాష్ట్ర ఆర్గానిక్ ప్రొడక్ట్ సర్టిఫికేషన్ అథారిటీ చైర్మన్ దేవదత్, చిత్రంలో డైరెక్టర్ డాక్టర్ యడ్లపల్లి సతీష్ తదితరులు

గుంటూరు సిటీ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రానున్న రోజుల్లో ఆర్గానిక్ పంటలు పండించే వారికే మాత్రమే ప్రభుత్వం అన్ని రకాల ప్రోత్సాహకాలు అందజేస్తుందని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆర్గానిక్ ప్రొడక్ట్ సర్టిఫికేషన్ అథారిటీ చైర్మన్ శావల దేవదత్ తెలిపారు. బుధవారం గుంటూరు లాం ఫాంలోని కార్యాలయంలో జరిగిన సమీక్షలో ఆయన ప్రసంగించారు. మొత్తం సాగు భూమిలో 35శాతం ఆర్గానిక్ పంటలు మాత్రమే పండించేలా లక్ష్యంగా పెట్టుకుని ముందుకు వెళ్లాలన్నారు. ప్రజా ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని క్రిమిసంహారక మందులు లేని పంటల సాగుకు ప్రోత్సాహం ఇస్తున్నట్లు తెలిపారు. మేలైన వ్యవసాయ పద్ధతుల ద్వారా రాష్ట్రంలో 1,977 మంది రైతులు 1,594 హెక్టార్ల విస్తీర్ణంలో పండించిన 5,549 మెట్రిక్ టన్నుల ఉత్పత్తులను అధిక ధరకు విక్రయించి లబ్ధి పొందారన్నారు. సమీక్షలో డైరెక్టర్ డాక్టర్ యడ్లపల్లి సతీష్, క్వాలిటీ మేనేజర్ డాక్టర్ యుగంధర్, జోనల్ ఆఫీసర్లు డాక్టర్ సారిక, డాక్టర్ మూల ప్రతాపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ సదుపాయాలను కల్పించాలి

● వీఏవోల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ముత్తినేని నాగేశ్వరరావు



మాట్లాడుతున్న ఎం.నాగేశ్వరరావు, పాల్గొన్న సంఘ సభ్యులు

గుంటూరు (తూర్పు), ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): గతంలో ఉన్న సవరణ ఉత్తర్వులను రద్దు చేసి, వీఏవోలు అందరికీ పెన్షన్లు కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ విశ్రాంత సంఘం, విశ్రాంత ఉద్యోగుల విభాగపు రాష్ట్ర అధ్యక్షుడు ముత్తినేని నాగేశ్వరరావు తెలిపారు. గుంటూరు, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ భవనంలో బుధవారం సంఘ కార్యవర్గ సమావేశంలో ఆయన ప్రసంగించారు. పదేళ్ల సర్వీసు ఉన్న వారికి సర్వీసు పెన్షన్, ఇతర సదుపాయాలను కల్పించాలని 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం జీవోను జారీ చేసిందన్నారు. కాకపోతే పార్టటైమ్ సర్వీస్, వాలంటరీ పదవి విరమణకు పనికిరాదని కొందరు అభ్యంతరం తెలుపుతూ ఆ జీవోను అమలు జరపకుండా నిలిపివేశారని గుర్తుచేశారు. జీవోను అమలు చేయాలని ఎనిమిది ఏళ్ల నుంచి న్యాయపోరాటం చేస్తున్నామని తెలిపారు. కౌంటర్లు దాఖలు చేయాలని కోరుతూ ఈ మధ్య సీఎస్‌కు వినతిపత్రం అందజేశామన్నారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టి సారించి, న్యాయ పోరాటానికి సహకరించి, పెన్షన్ సదుపాయాలను కల్పించాలని కోరారు. సమావేశంలో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముప్పాళ్ల రామదాసు, కోశాధికారి వాన కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని పర్యటనను విజయవంతం చేయాలి

● 2న అమరావతికి నరేంద్రమోదీ రాక
● శంకుస్థాపనల కంటే ముందు రోడ్ షో
● పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లుకు కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశం



కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ

గుంటూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 2న రాజధాని అమరావతిలో ప్రధాని నరేంద్రమోదీ పర్యటనను విజయవంతం చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. ప్రధాని పర్యటన ఏర్పాట్లపై అధికారులతో బుధవారం కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశ మందిరంలో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మోదీ రాజధానిలో వివిధ శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొననున్న దృష్ట్యా అందుకు తగిన ఏర్పాట్లను అధికారులు శ్రద్ధపెట్టి చేయాలన్నారు. ప్రధాని బహిరంగ సభలో పాల్గొనే ముందు రోడ్డు షో ఉంటుందని, అందుకు తగ్గ ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి రూట్ ప్లాన్‌పై అధికారులందరు కూడా అవగాహన కలిగి ఉండి వాహనాల రాకపోకలు, ప్రజలు ఇబ్బంది పడకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టాలన్నారు. బ్యారికేడ్ పనులు పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్పీ సతీష్‌కుమార్, తెనాలి సబ్ కలెక్టర్ సంజనసింహా, నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, డీఆర్వో ఖాజావలి, ఏఎస్పీ సుప్రజ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గంగరాజు, జడ్పీ సీఈవో జ్యోతిబసు, డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి, డ్వామా పీడీ శంకర్, పంచాయతీరాజ్ ఎస్ఈ బ్రహ్మయ్య, డీఈవో రేణుక, జిల్లా ఉపాధి అధికారి దుర్గాబాయి, ఉద్యాన శాఖ అధికారి రవీంద్ర, గ్రౌండ్ వాటర్ డీడీ వందనం, డీపీవో వెంకటేశ్వర్లు, హౌసింగ్ పీడీ ప్రసాద్, జిల్లా కో ఆపరేటివ్ అధికారి వీరాచారి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినిని అభినందిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, డీఈవో రేణుక తదితరులు

ఉప్పలపాడు జడ్పీ స్కూల్ విద్యార్థినికి
వెయిట్ లిఫ్టింగ్‌లో సిల్వర్ మెడల్

గుంటూరు(విద్య), ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): స్థానిక ఉప్పలపాడులోని జడ్పీ స్కూల్ విద్యార్థి జాతీయ స్థాయిలో జరిగిన వెయిట్ లిఫ్టింగ్‌లో ప్రతిభ చూపింది. ఈనెల 7వ తేదీ నుండి 12వరకు మణిపూర్‌లోని ఇంఫాల్‌నందు జరిగిన జాతీయ స్థాయి అండర్-17 విభాగంలో 76 కేజీల విభాగం వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ఉప్పలపాడు జడ్పీ స్కూల్ విద్యార్థిని బిట్రా రోచిస్మతి కాంస్య పతకం సాధించింది. ఈ సందర్భంగా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఆమెను అభినందించారు. కార్యక్రమంలో డీఈవో రేణుక, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ మెల్లంపూడి రవి ఉప్పలపాడు పీడీ సీహెచ్ వినయ్‌కుమార్, రాష్ట్ర పీడీ పీఈటీ అసోసియేషన్ అధ్యక్షుడు బి.కరీముల్లారావు, జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ శ్రీను, కోచ్, పీడీ శిరీష తదితరులు పాల్గొన్నారు.

అంతర్ జిల్లాల బదిలీలు చేపట్టాలి

● నోబుల్ టీచర్స్ అసోసియేషన్



పార్వతికి వినతిపత్రం అందజేస్తున్న ఎన్‌టీఏ నాయకులు

గుంటూరు (విద్య), ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వివిధ కేడర్లలో జడ్పీ, మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు అంతర్ జిల్లాల బదిలీలు చేపట్టాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కొండూరు శ్రీనివాసరాజు, బొనిగల హైమారావులు విజ్ఞప్తిచేశారు. ఈమేరకు బుధవారం పాఠశాల విద్య డైరెక్టర్ పి. పార్వతికి వినతిపత్రం అందజేశారు. కొన్ని సంవత్సరాలుగా ఉపాధ్యాయులు వారి కుటుంబాలకు దూరంగా ఉన్నారని, వెంటనే వేసవి సెలవులలో బదిలీలు చేపట్టాలని కోరారు. అలాగే మోడల్ స్కూల్స్‌లో పనిచేయుచున్న ఉపాధ్యాయులకు ఈ వేసవి సెలవులలో బదిలీలు చేపట్టాలని హైమారావు తదితరులు కోరారు.

జిల్లాకు 28 ఆధార్ కిట్ల మంజూరు

● డిప్యూటీ సీఈఓ చొప్పర కృష్ణ



సచివాలయాల సిబ్బందికి ఆధార్ కిట్లు అందజేస్తున్న డిప్యూటీ సీఈఓ చొప్పర కృష్ణ, మోహన్‌రెడ్డి తదితరులు

గుంటూరు సిటీ, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఆధార్‌సేవలు వేగవంతం చేసేందుకు ప్రభుత్వం గుంటూరు జిల్లాకు 28 ఆధార్‌కిట్లు మంజూరుచేసిందని జడ్పీ డిప్యూటీ సీఈఓ చొప్పర కృష్ణ తెలిపారు. ఒక్కో కిట్ విలువ రూ.1.80లక్షలు ఉంటుందన్నారు. ప్రతి కిట్‌లో ల్యాప్‌ట్యాప్‌తోపాటు, మరో 15 పరికరాలు ఉన్నాయని, కిట్లను జిల్లాలోని సచివాలయ సిబ్బందికి అందజేశామని తెలిపారు. ఆధార్‌సేవలు ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం ఈ కిట్లను అందజేసిందన్నారు. కార్యక్రమంలో సచివాలయాల పర్యవేక్షకుడు మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చిత్రాల ప్రదర్శనను తిలకిస్తున్న రాష్ట్ర ఆర్ట్స్ క్రాఫ్ట్ శిల్పారామం చైర్ పర్సన్ మంజుల రెడ్డి

చిత్రకళా ప్రదర్శన ప్రారంభం

పెదకాకాని, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో బి ఎఫ్ ఏ ప్రథమ, ద్వితీయ, తృతీయ విద్యార్థుల రూపొందించిన చిత్రాల ప్రదర్శనను బుధవారం ఆర్ట్స్ క్రాఫ్ట్ శిల్పారామం రాష్ట్ర చైర్పర్సన్ సిహెచ్ మంజులా రెడ్డి ప్రారంభించారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్క చిత్రము ఒకదానికొక్కటి పోటీపడే విధంగా చిత్రీకరించారని విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు శ్రీలక్ష్మీ చెన్నకేశవుడి రథోత్సవం

మాచర్ల రూరల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా మాచర్లలో శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి 145వ రథోత్సవం గురువారం వైభవంగా జరగనుంది. ప్రతియేటా చైత్రశుద్ధ త్రయోదశి నుంచి 15రోజులపాటు మాచర్లలో శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి కల్యాణ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. అందులో స్వామివారి కల్యాణం అనంతరం రథోత్సవం ప్రధానఘట్టం. సుమారు లక్షమంది వరకు ఈ వేడుకను కనులారా వీక్షించేందుకు హాజరవుతారు.

రాయగడ ఎక్స్‌ప్రెస్
కొద్ది రోజులపాటు విజయనగరం వరకే

గుంటూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు డివిజన్‌లో ఇంజినీరింగ్ పనుల కారనంగా నంబరు. 17243 గుంటూరు - రాయగడ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 21, 28, మే 3వ తేదీన విజయనగరం వరకే ప్రయాణిస్తుందని గుంటూరు డివిజనల్ రైల్వే అధికారి సుధేష్ణ సేన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 17244 రాయగడ - గుంటూరు ఎక్స్‌ప్రెస్ ఈ నెల 22, 29, మే 4వ తేదీన విజయనగరం నుంచి బయలుదేరి గుంటూరుకు ప్రయాణిస్తుందన్నారు. ఈ మార్పులను ప్రయాణీకులు గమనించాలని డీఆర్ఎం విజ్ఞప్తి చేశారు.

జీవో 35ని రద్దు చేయాలి

గుంటూరు సిటీ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్‌లోని ఉద్యోగుల ప్రయోజనాలకు ఇబ్బంది కలిగించి, క్యాడర్‌లో తీవ్ర వ్యత్యాసాలకు కారణమైన జీఓ నెం.35ని వెంటనే రద్దు చేయాలని ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం నేతలు కమిషనర్ ఎం కృష్ణతేజకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం నేతలు బుధవారం పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషన్‌కుమార్, కమిషనర్ కృష్ణతేజను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సంఘం నేతలు మాట్లాడుతూ జీఓ 35 వల్ల ఏవోలకు ఎంపీడీఓల ప్రమోషన్‌లలో తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. ప్రభుత్వం స్పందించి జీఓ రద్దుచేయని పక్షంలో ఉద్యమం చేపడతామని వెల్లడించారు.కార్యక్రమంలో ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం సలహాదారు బండి శ్రీనివాసరావు, అధ్యక్షుడు ఆర్‌వీవీ రమేష్, జిల్లా నాయకులు డాక్టర్ కూచిపూడి మోహన్‌రావు, గుంటుపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

హైడ్రో గంజాయి విక్రయిస్తున్న ముఠా అరెస్టు

● రూ.7.5 లక్షల విలువైన గంజాయి స్వాధీనం



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ సతీశ్‌కుమార్

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వ్యసనాలతో అప్పుల పాలై సులభంగా డబ్బు సంపాదించాలని హైడ్రో గంజాయి విక్రయిస్తున్న ముగ్గుర్ని పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు బుధవారం మంగళగిరి రూరల్ సర్కిల్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్పీ సతీశ్‌కుమార్ నిందితుల వివరాలను వెల్లడించారు. పశ్చిమ గోదావరి జిల్లా ఉండి మండలం చెరుకువాడ గ్రామానికి చెందిన ఇందుకూరి రామకృష్ణంరాజు, విశాఖపట్నం సీతమ్మధార ప్రాంతానికి చెందిన నాగరాజు శ్రీహర్షవర్ధన్ వర్మ స్నేహితులు. భీమవరంలో కోడిపందేలకు వెళ్లినప్పుడు వీరికి విశాఖ జిల్లా గోపాలపట్నానికి చెందిన పురుగంటి అనిల్‌కుమార్‌తో పరిచయం ఏర్పడింది. అనిల్‌కుమార్ తన వద్ద ఉన్న గంజాయిని రామకృష్ణంరాజు, హర్షవర్ధన్‌లకు విక్రయించాడు. ఇలా రెండేళ్లపాటు వీరి మధ్య గంజాయి లావాదేవీలు నడిచాయి. ఈ క్రమంలో అనిల్‌కుమార్ బెంగళూరులో తన స్నేహితుడైన అమిత్ వద్ద హైడ్రో గంజాయి ఉందని, దానికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంటుందని, గ్రాము రూ.700 చొప్పున కొని రూ.1500 చొప్పున విక్రయించవచ్చని తెలిపాడు. దీంతో అనిల్‌కుమార్, రామకృష్ణలు ఈ నెల 14న కారులో బెంగళూరు వెళ్లి అమిత్ అనే వ్యక్తి వద్ద సుమారు రూ.7.5 లక్షల విలువైన 500 గ్రాముల హైడ్రో గంజాయిని కొనుగోలు చేశారు. బెంగళూరు నుంచి ఏలూరుకు తిరిగివస్తుండగా మార్గమధ్యలో కాజ టోల్‌ప్లాజా వద్ద హర్షవర్ధన్ నుంచి వారు గంజాయి తీసుకుంటుండగా పోలీసులు దాడి చేశారు. ముగ్గురు నిందితులతోపాటు 500 గ్రాముల గంజాయి, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడ్ని అదుపులోకి తీసుకోవాల్సి ఉందని ఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో మంగళగిరి రూరల్ సీఐ వై.శ్రీనివాసరావు, ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్, సిబ్బంది పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	248.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	258.00

గిన్నిస్ బుక్‌లో కర్లపాలెం విద్యార్థి

● కీబోర్డు ప్లేలో జోయెల్‌విల్సన్ ప్రపంచ రికార్డు



గిన్నిస్‌బుక్‌లో నమోదు పత్రంతో జోయెల్ విల్సన్

కర్లపాలెం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుండివారిపాలెం పంచాయతీ బిడారు దిబ్బకు చెందిన విద్యార్థి కట్టుపల్లి జోయెల్‌విల్సన్ గిన్నీస్‌బుక్‌లో స్థానం దక్కించుకున్నారు. విల్సన్‌బాబు, ప్రత్యూష దంపతుల పెద్ద కుమారుడైన విల్సన్ కీబోర్డు ప్లేతో ప్రపంచరికార్డు సాధించారు. ఇటీవల 18 దేశాల నుంచి 1046 మంది ఒకేసారి మ్యూజిక్ ప్లే చేసి గిన్నీస్‌బుక్‌లో పేరు నమోదు చేసుకున్నారు. ఆగస్టీన్ దండంగి సారధ్యంలో విల్సన్ కీబోర్డులో మెలకువలు నేర్చుకుని పోటీలో పాల్గొన్నారు. గిన్నీస్‌బుక్‌లో స్థానం దక్కించుకున్న విల్సన్‌ను జిల్లాలోని పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయనాయకులు ప్రత్యేకంగా అభినందించారు.

1,57,640 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 1,59,032 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,57,640 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 76,896 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			తేజ	10000	13500
334	9500	13100	షార్క్-1	10000	12300
నంబరు.5	10000	12800	బ్యాడిగి 355	10000	13000
273	10000	12500	సింజెంటా		
341	10500	13500	బ్యాడిగి 5531	--	--
4884	10000	11400	దేవనూరుడీలక్స్	10000	12500
సూపర్10	–	–	ఆర్మూరు	9800	11000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			తాలుకాయలు	4500	6500

రేవులోకి వస్తే.. లేపేస్తాం

● కృష్ణా జిల్లా వాడివి ఎలా వస్తావ్..
● గింజుపల్లి రేవులో పడవ పాటదారుడికి బెదిరింపులు
● కలెక్టర్, ఎస్పీ, జడ్పీ అధికారులకు ఫిర్యాదు చేసిన బాధితుడు

గుంటూరు సిటీ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): 'కృష్ణా జిల్లా వాడివి.. ఇక్కడకు వచ్చి చేసేది ఏమిటి.. పాట రద్దు చేసుకుని వెళ్లిపో.. రేవులోకి వస్తే లేపేస్తాం.. ఎక్కడికి వెళ్లినా ఏమీ చేయలేవు.. మేము లోకల్.. నువ్వు నాన్ లోకల్..' అంటూ అచ్చంపేట మండలం గింజుపల్లి పడవ పాటదారుడికి స్థానికులు బెదిరింపులు. ఈ మేరకు బాధితుడు ఇప్పటికే కలెక్టర్, ఎస్పీ, జెడ్పీ అధికారులకు ఫిర్యాదు చేశారు. రేవులోకి వస్తే లేపేస్తామని బెదిరిస్తుంటే సొమ్ము ఎలా చెల్లిస్తానని బాధితుడు జడ్పీ అధికారులను ప్రశ్నిస్తున్నారు. దీంతో జడ్పీ అధికారులు ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. జడ్పీ ఆదాయానికి గండి కొట్టే విధంగా ప్రైవేటు వ్యక్తులు ప్రవర్తిస్తే చూస్తూ ఊరుకోబోమని స్పష్టం చేస్తున్నారు. ఎటువంటి అనుమతి లేకుండానే గింజుపల్లి రేవులో పడవలు తిప్పుతున్న వారి వివరాలు సేకరించడంతో పాటు, పడవలను వెంటనే సీజ్ చేయాలని అచ్చంపేట ఎంపీడీవోను అధికారులు ఆదేశించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పడవ రేవుల కోసం ఇటీవల జడ్పీ పాటలు నిర్వహించగా గతంలో ఎన్నడూ లేని విధంగా ఆదాయం సమకూరింది. గింజుపల్లి రేవుకు రూ.14 లక్షలు, రూ.13.90 లక్షలు, రూ.13 లక్షలతో ముగ్గురు ముందుకు రాగా స్థానికుల బెదిరింపులకు భయపడి ఇద్దరు రేవులోకి వెళ్లేందుకు సాహసించలేదు. ఈ నేపథ్యంలో మూడో వ్యక్తికి రేవును అప్పగించేందుకు అధికారులు సిద్ధపడినట్లు సమాచారం ఇచ్చారు. అయితే ఆ వ్యక్తి రేవులోకి అడుగుపెట్టడంతోనే బెదిరింపులు ఆరంభం అయ్యాయి. ఈ పరిస్థితులపై జడ్పీ అధికారులకు లేఖ రాసి, కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

మొదటి నుంచి వివాదమే...

గింజుపల్లి రేవు వ్యవహారంలో మొదటి నుంచి వివాదం నెలకొంది. నామమాత్రపు రుసుముతో రేవును దక్కించుకునేందుకు కొందరు సిఫార్సులు కూడా చేయించినట్లు తెలుస్తుంది. అయితే అది బహిరంగ వేలం కావడంతో అధికారులు చేతులు ఎత్తేశారు. ప్రస్తుతం పాత వ్యక్తులే రేవులో అనధికారికంగా పడవ తిప్పుతూ అధికారికంగా పాట పాడుకున్న వారిని రేవులోకి రాకుండా అడ్డుకుంటున్నట్లు తేలింది.

జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ చేస్తే జర్మనీలో ఉద్యోగాలు

గుంటూరు సిటీ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ చదివి 20 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగిన వారికి జర్మనీలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ టీవీ విజయలక్ష్మి తెలిపారు. నైపుణ్యం కోసం ప్రత్యక్ష శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు గుంటూరు సమీపంలోని ఓబులునాయుడుపాలెం శిక్షణ కేంద్రంలో సంప్రదించాలన్నారు.

525 ఎకరాల్లో ఉద్యాన పంటల పెంపకం

గుంటూరు సిటీ, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లాలో 2025 -26 ఆర్థిక సంవత్సరానికి 525 ఎకరాల్లో ఉపాధిహామీ పథకం కింద ఉద్యానపంటల పెంపకానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శంకర్ వెల్లడించారు. లబ్ధిదారుల గుర్తింపు, పరిపాలనామోదం మంజూరు ప్రక్రియను ఈనెల 30వ తేదీ లోపు పూర్తిచేయాలని ఉపాధి హామీ సిబ్బందిని ఆయన ఆదేశించారు. గుంటూరు మండల పరిషత్ కార్యాలయంలో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ మాట్లాడుతూ 500 ఎకరాల ఉద్యానపంటలు, 25 ఎకరాల మునగపంటను ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించిందని, వ్యవసాయ అనుబంధ శాఖల మండల స్థాయి అధికారులతో సమన్వయం చేసుకొని లక్ష్యానికి మించి లబ్ధిదారులను గుర్తించాలన్నారు. జిల్లా ఉద్యాన శాఖాధికారి బి.రవీంద్రబాబు మాట్లాడుతూ రైతులను సంప్రదాయ వ్యవసాయ పంటల నుంచి ఉద్యాన పంటలకు మళ్లేలా చూడాలన్నారు. జిల్లా వ్యవసాయాధికారి నున్న వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉద్యానపంటల సా గుకు రైతులను గుర్తించే క్రమంలోనే ఫారంపాండ్ కూడా మంజూరుచేస్తే చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. మైక్రో ఇరిగేషన్ పీడీ వజ్రశ్రీ మాట్లాడుతూ ఈ ఉద్యానపంటల లబ్ధిదారులకు ఉపాధి పథకం ముగిసిన వెంటనే సూక్ష్మ నీటి పారుదల పథకాన్ని వర్తింపజేస్తామన్నారు.



మాట్లాడుతున్న పీడీ శంకర్, జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు

ఐఎన్‌టీఎస్‌వో జాతీయ స్థాయిలో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ

గుంటూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో జరిగిన ఐఎన్‌టీఎస్‌వో లెవల్-2 పరీక్ష ఫలితాల్లో గుంటూరు శ్రీ చైతన్య పాఠశాలల విద్యార్థులు మంచి ప్రతిభని కనబరిచారని ఏజీఎం డాక్టర్ నూతలపాటి అంజయ్య అన్నారు. స్థానిక నవభారత్‌నగర్‌లోని పాఠశాల ఆవరణలో బుధవారం జరిగిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఏజీఎం అంజయ్య మాట్లాడుతూ తమ విద్యా సంస్థలకు చెందిన మొత్తం 832 మంది విద్యార్థులు ప్రతిభ కనబరచగా అందులో ముగ్గురు గ్రాండ్ ప్రైజ్‌గా ల్యాప్‌టాప్‌లు, 13 మందికి మొదటి బహుమతులుగా ట్యాబ్‌లు గెలుపొందారని చెప్పారు. అలానే 15 మంది ద్వితీయ స్థానంలో, 21 మంది తృతీయ స్థానంలో నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల అకడమిక్ కో-ఆర్డినేటర్స్ సచ్చిదానందమూర్తి, గౌరీశంకర్, ప్రిన్సిపల్, డీన్‌లు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న శ్రీ చైతన్య విద్యా సంస్థల ఏజీఎం డాక్టర్ అంజయ్య

టీం వర్క్ పక్కా ప్రణాళికతో విజయం : కమిషనర్

గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): టీం వర్క్, ప్రణాళిక పక్కాగా ఉంటే ప్రతి కార్యక్రమం విజయవంతం అవుతుందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పేర్కొన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో ప్రభుత్వ ప్రాధాన్యత సర్వేలన్నీ నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని ఆయన సూచించారు. స్థానిక శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నగర పాలక సంస్థ విభాగాధిపతులు, అధికారులు, సచివాలయ కార్యదర్శులతో బుధవారం కమిషనర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వార్డు సచివాలయాల వారీగా సర్వేలన్నీ నిర్దేశిత గడువులోగా పూర్తి చేయడానికి కార్యదర్శులు, నోడల్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మే 2న అమరావతిలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటనలో జీఎంసీ అధికారులకు కేటాయించిన విధులను సమర్థంగా నిర్వహించాలన్నారు. అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, ఎస్ఈ నాగ మల్లేశ్వరరావు, సిటీ ప్లానర్ రాంబాబు, సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సీహెచ్ శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, పి.శ్రీనివాసరావు, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఏకాగ్రత, కృషితోనే ఉద్యోగావకాశాలు

● మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు



మాట్లాడుతున్న కేఎస్ లక్ష్మణరావు

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ఏకాగ్రత, కృషితోనే ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. స్థానిక బ్రాడీపేట శ్రీ మాజేటి గురవయ్య డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో బుధవారం డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పోటీ పరీక్షలలో ఉద్యోగావకాశాలు కేవలం ఒక్క మార్కు ఫలితాలను నిర్దేశిస్తాయని అన్నారు. అభ్యర్థులకు సిలబస్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. గైడ్లు కొంతవరకే ఉపయోగపడతాయని తెలుగు అకాడమీ ప్రచురించిన టెక్స్ట్ బుక్స్ ను బాగా అధ్యయనం చేయాలని తెలిపారు. అనంతరం ఆదిత్య కాంపిటీషన్స్ వారు రూపొందించిన టెట్, డీఎస్సీ స్టడీ మెటీరియల్ పుస్తకాన్ని ఆవిష్కరించి, అభ్యర్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ మాజేటి గురవయ్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మంచాల బోసుబాబు, తన్నీరు రాజ్యలక్ష్మి, అజయ్, ప్రభంజన్, కె.ప్రణయ్ కుమార్ పాల్గొన్నారు.

చదరంగంతో మేధో వికాసం



విజేతలతో చుక్కపల్లి ప్రియాంక, అసోసియేషన్ సభ్యులు

గుంటూరు (తూర్పు), ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): చదరంగంతో ఏకాగ్రత పెరగడంతో పాటు మెదడు చురుగ్గా పని చేస్తుందని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ చుక్కపల్లి ప్రియాంక అన్నారు. స్థానిక ఢిల్లీ పబ్లిక్ పాఠశాలలో అండర్-15 బాల, బాలికల విభాగాల్లో జిల్లా స్థాయి చెస్ పోటీలు జరిగాయి. ముగింపు కార్యక్రమంలో ఆమె పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఆమె మాట్లాడుతూ నిరంతర సాధనతో చెస్‌లో నైపుణ్యాలు పెంచుకోవాలని సూచించారు. టోర్నమెంట్ డైరెక్టర్ వై వీకే చక్రవర్తి మాట్లాడుతూ విజేతలు జూలైలో వైజాగ్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. కార్యక్రమంలో జిల్లా చదరంగం అధ్యక్షుడు రవీంద్రరాజు, పాఠశాల ప్రిన్సిపల్ రత్నమాల, అకడమిక్ డైరెక్టర్ ఉషారాణి పాల్గొని విజేతలను అభినందించారు. బాలుర విభాగంలో హర్షవర్ధన్, అర్జున్ ఆదిత్య, దినేష్‌రెడ్డి, హరి సూర్యనారాయణ, గౌతమ్, బాలికల విభాగంలో తేజ అనూష, శాన్విక, జయ అహల్య, ధార్మికదేవి, అనన్య కృతిక విజేతలుగా నిలిచారు.

వినూత్నంగా 'భూతకాలం' నాటకం

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎల్వీఆర్ అండ్ సన్స్ క్లబ్ రీడింగ్ రూమ్, కొరిటెపాడు వేదికగా మూడు రోజుల పాటు జరిగిన డాక్టర్ మాగంటి మురళీమోహన్ నాటకోత్సవాలు బుధవారంతో ముగిసాయి. ముగింపు కార్యక్రమాలను కళావిపంచి అధ్యక్షుడు బొప్పన నరసింహారావు, కన్వీనర్లు గుమ్మడి శ్రీమన్నారాయణ, కాట్రగడ్డ రామకృష్ణ ప్రసాద్, పిన్నమనేని మృత్యుంజయరావు తదితరులు ప్రారంభించారు. తొలుత తెలుగు నాటకరంగ దినోత్సవం పురస్కరించుకొని రంగస్థల నటుడు, జర్నలిస్ట్ ఫలతోటి జోసఫ్‌ను ఘనంగా సత్కరించారు. అనంతరం డాక్టర్ రాధ సగిలి నిర్వహణలో మాడభూషి దివాకరబాబు రచించిన, డాక్టర్ గోవాడ వెంకట్ దర్శకత్వం వహించిన, గోవాడ క్రియేషన్స్ హైదరాబాద్ వారి భూతకాలం నాటకం వినూత్నంగా సాగి ప్రేక్షకులను ఆకట్టుకుంది. సమితి సభ్యులు అతిథులను, కళాకారులను సత్కరించారు.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



చుట్టుగుంట సెంటర్‌లో ఎండలోనే ప్రయాణికులు ఇలా...



జీటీ రోడ్డులో ఎండలోనే ప్రయాణికుల పడిగాపులు

నిలువ నీడ లేక ప్రయాణికులు విలవిల

● నగరంలో బస్టాప్‌ల నిర్మాణంపై నిర్లక్ష్యం

గుంటూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండు వేసవిలో బస్టాప్‌ల వద్ద ప్రయాణికులు ప్రత్యక్ష నరకాన్ని చూస్తున్నారు. నగర పరిధిలో బస్టాప్‌ల ఏర్పాటులో నగరపాలక సంస్థ, అధికార యంత్రాంగం నిర్లక్ష్యం ప్రయాణికులకు శాపంగా మారింది. నగరంలో బస్ బేలు నిర్మించాలన్న ప్రతిపాదనలు ఏళ్ల తరబడి ఉన్నాయి. అయితే వాటిని అమలు చేయడంలో నిర్లక్ష్యం చూపుతున్నారు. గుజ్జనగుండ్ల, కొరిటపాడు, శంకర్‌విలాస్, ఏసీ కళాశాల, మార్కెట్, చుట్టుగుంట, టుబాకో బోర్డు ఎదుట జీటీ రోడ్డు సెంటర్‌లలో బస్‌బేలు లేక ప్రజలు ఎండలో విలవిల్లాడిపోతున్నారు. ఆటోలు, బస్సుల కోసం ఎండలోనే నిలబడి నీరసించిపోతున్నారు.



మార్కెట్ సెంటర్‌లో నీడ లేక ఎండలోనే మగ్గుతున్న ప్రయాణికులు

ఆప్కాస్ రద్దు చేసి మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

● సీఐటీయూ డిమాండ్

గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆప్కాస్ రద్దు చేసి మున్సిపల్ కార్మికులను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించకుండా పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయం ఎదుట ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. ముత్యాలరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆప్కాస్ రద్దు చేసి ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించాలని ప్రయత్నాలు చేస్తుందని, దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం నగర పాలక సంస్థ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో యూనియన్ నగర అధ్యక్షుడు పూనేపల్లి శ్రీనివాసరావు, నాయకులు కుంభా శివయ్య, కారసాల శౌరమ్మ, పచ్చల సామ్రాజ్యం, కాశంగి భాగ్యరాజు, కె.మరియదాసు, నరేంద్ర, శ్రీనివాసరావు, సురేష్ బాబు, నిర్మల, రాంకోటమ్మ, చెంచయ్య, షేక్ రసూల్ పాల్గొన్నారు.

నేడు హిందూ ఫార్మసీ కళాశాల వార్షికోత్సవం

గుంటూరు(విద్య), ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): స్థానిక అమరావతి రోడ్డులో ఉన్న హిందూ ఫార్మసీ కళాశాల 25వ వార్షికోత్సవాలు గురువారం నిర్వహిస్తున్నట్లు కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు జూపూడి రంగరాజు, డాక్టర్ మధుసూదనరావు బుధవారం తెలిపారు. ఈ మేరకు కళాశాలలో సమావేశం నిర్వహించి, వివరాలు వెల్లడించారు. చైర్మన్ జూపూడి రంగరాజు మాట్లాడుతూ 1999లో బీ ఫార్మసీతో ప్రారంభించిన కళాశాల ప్రస్తుతం డీ ఫార్మసీ, ఎం ఫార్మసీ, ఫార్మా డీ, ఫార్మా డీ (పి.బి) కోర్స్‌లు, పరిశోధన కేంద్రం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వార్షికోత్సవాలకు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, బీజేపీ జనరల్ సెక్రటరీ నూకల మధుకర్ తదితరులు హాజరుకానున్నట్లు వెల్లడించారు. కళాశాల ఆవరణలో ప్రధానమంత్రి భారతీయ జన ఔషధి కేంద్రం నిర్వహణకు భవన నిర్మాణానికిశంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ప్రిన్సిపల్ నాగభూషణం, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.ప్రత్యూష, ఫార్మా డీ డైరెక్టర్ డాక్టర్ పి. సీతారామయ్య పాల్గొన్నారు.



వార్షికోత్సవ ఆహ్వాన పత్రం విడుదల చేస్తున్న జూపూడి రంగరాజు తదితరులు

జాతీయ సమ్మె జయప్రదానికి పిలుపు

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ మే 20న జాతీయ కార్మిక సంఘాలు ఇచ్చిన సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి దయా రమాదేవి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక పాత గుంటూరులోని యూనియన్ కార్యాలయంలో జిల్లా ఆఫీస్ బ్యారర్స్ సమావేశం బి.లక్ష్మణరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ ప్రతి కార్మికుడి వద్దకు సార్వత్రిక డిమాండ్లను తీసుకెళ్లాలని కోరారు. ఈ సమావేశంలో దండా లక్ష్మీనారాయణ, సాంబశివరావు, వేముల దుర్గారావు, కె.బాబు ప్రసాద్, షేక్ హుస్సేన్ వలి, వై.నేతాజీ పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి



వెంకటరెడ్డి (ఫైల్)

గుంటూరు(విద్య), ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉపాధ్యాయుడు పీఎఫ్ బెనిఫిట్స్ కోసం వచ్చి గుండెపోటుతో మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం బ్రాహ్మణపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసిన చల్లా వెంకటరెడ్డి పీఎఫ్ స్లిప్‌పై కౌంటర్ సైన్ కోసం డీఈవో కార్యాలయానికి వచ్చారు. ఇక్కడ కౌంటర్ సైన్ చేయకూడదని పల్నాడు జిల్లాలోనే చేయించుకోవాలని విద్యాశాఖ సిబ్బంది సూచించారు. దీంతో ఆయన డీఈఓ కార్యాలయం నుంచి బయటకు వచ్చే సమయంలో గుండెపోటుకు గురై కుప్పకూలిపోయారు. ఉర్దూ డీఐ ఎస్కే ఎండీ ఖాసిం, విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది, మిత్రులు ఆయనను హుటాహుటిన నగరంపాలెంలోని రమేష్ హాస్పటల్‌కు తరలించారు. అప్పటికే వెంకటరెడ్డి మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. డీఈవో సీవీ రేణుక, తూర్పు ఎంఈవో ఖుద్దూస్ తదితరులు వెంకటరెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి ఏపీటీఎఫ్ అధ్యక్షుడు కె.బసవలింగారావు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

టీజేపీఎస్‌లో ముగిసిన లేజర్ రన్ పోటీలు

గుంటూరు(విద్య), ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : స్థానిక టీజేపీఎస్ కళాశాలలో బుధవారం మోడరన్ పెంటాథలన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి తొమ్మిదవ ఎంపిఎఫ్ లేజర్ రన్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో జి.శ్రీనివాస్ నాయక్ (ఆంధ్రప్రదేశ్), ఏ దినేష్ (తెలంగాణ), అమర్‌జిత్ సింగ్ (తెలంగాణ), కె ప్రేమ్‌చంద్ (ఆంధ్రప్రదేశ్), ఆర్.నరేంద్ర (ఆంధ్రప్రదేశ్), ఎస్.షణ్ముఖ్ సంతోష్ (ఆంధ్రప్రదేశ్), షేక్ జచేరియా (ఆంధ్రప్రదేశ్), ఎస్కే పర్వీన్ (ఆంధ్రప్రదేశ్), సిరాలిని (ఆంధ్రప్రదేశ్) వారికి వరుసగా గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సాధించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో చైర్మన్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, కళాశాల కార్యదర్శి కేవీ బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

లోక్‌సభ స్థానాల పునర్విభజనపై 20న సదస్సు

గుంటూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): పార్లమెంటు నియోజకవర్గాల పునర్విభజన - దుష్ఫలితాలు అనే అంశంపై నగరాలులోని బీవీఆర్ కన్వెన్షన్‌లో ఈ నెల 20న సదస్సు నిర్వహించనున్నట్లు బీపీ మండల్ సేన అధ్యక్షుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు, వర్కింగ్ ప్రెసిడెంట్ కొల్లికొండ వెంకటసుబ్రమణ్యం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సులో భారత్ జోడో అభియాన్ వ్యవస్థాపకుడు యోగేంద్రయాదవ్ పాల్గొంటారన్నారు. ప్రజా సంఘాల నాయకులు, మేధావులు, ప్రజలు హాజరుకావాలని తెలిపారు.

ఈడీ కేసులతో గాంధీ కుటుంబాన్ని భయపెట్టలేరు

● సీజీఎస్‌టీ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ నాయకుల ధర్నా

గుంటూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): రాజకీయ కుట్రలో భాగంగా ఈడీ కేసులు మోపి గాంధీ కుటుంబాన్ని భయపెట్టలేరని మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్‌వలి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చిలకా విజయ్‌కుమార్ అన్నారు. నేషనల్ హెరాల్డ్ పత్రికలో అక్రమాలు జరిగాయంటూ కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలను ఈడీ విచారణకు పిలవడంపై కాంగ్రెస్ నేతలు మస్తాన్‌వలి, విజయ్‌కుమార్, పశ్చిమ కో ఆర్డినేటర్ రాచకొండ జాన్‌బాబు, ఏపీసీసీ ప్రధాన కార్యదర్శి మదన మోహన్‌రెడ్డి, బిళ్లా సునీల్ పలువురు నాయకులు నగరంపాలెం కన్నావారితోటలోని సీజీఎస్టీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. రోజురోజుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాదరణ కోల్పోతుందని, రాహుల్ గాంధీ బీజేపీ విధానాలను వ్యతిరేకిస్తూ పలికిన ప్రతి మాట అక్షర సత్యం అయిందన్నారు. ఈ కార్యక్రమంలో గద్దం పాల్‌విజయ్‌కుమార్, సయ్యద్ జబీవుల్లా, యన్నం సుధీర్‌బాబు, తోడేటి సందీప్, కట్టా జవహర్‌బాబు, షేక్ సలీం, బొట్ల బ్రహ్మం, ప్రసాద్ తదితరులున్నారు.

ఆకట్టుకున్న 'శ్రీకృష్ణ రాయబారం'

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలోని అన్నమయ్య కళా వేదికపై బుధవారం భగవాన్ శరణం కల్చరల్ అసోసియేషన్, హైదరాబాద్ శ్రీ రామకృష్ణా నాట్య మండలి సంయుక్త నిర్వహణలో తెలుగు నాటకరంగ దినోత్సవం, మల్లాది చంద్రశేఖరశాస్త్రి శత జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సభకు డాక్టర్ పిల్లుట్ల లక్ష్మీకాంతశర్మ అధ్యక్షత వహించారు. అతిథులుగా సినీ నటుడు మల్లాది రాఘవరావు, ఆలయ కమిటీ అధ్యక్షుడు మస్తానయ్య, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, డాక్టర్ చింతలపాటి శూలపాణి, సూర్యనారాయణ పాల్గొన్నారు. ప్రముఖ రంగ స్థల నటుడు, రచయిత, దర్శకుడు పి.వి.ఎన్. కృష్ణను మల్లాది చంద్రశేఖరశాస్త్రి స్మారక పురస్కారంతో ఘనంగా సత్కరించారు. సభానంతరం శ్రీకృష్ణ రాయబారం పౌరాణిక పద్య నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. కళాకారులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

ఆ ఘనత కూటమి ప్రభుత్వానిదే : ఈరంటి

గుంటూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్న ఘనత సీఎం చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వానికే దక్కుతుందని కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్, టీడీపీ నాయకుడు కొనకళ్ల సత్యం పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు 125వ జయంతుత్సవాల్లో భాగంగా గుంటూరు అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో 12నెలల పాటు ప్రతి నెలా 16వ తేదీన ఉత్సవాలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఇందులో భాగంగా ఏటుకూరు రోడ్డులోని శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయం ఎదుట పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్పొరేటర్ సంకూరి శ్రీనివాసరావు, సంఘం అధ్యక్షుడు గుడివాడ రవీంద్రకుమార్, కార్యదర్శి కోట శేషగిరిరావు, బొలిశెట్టి బాపారావు, కొత్తూరి వెంకట్, రాయవరపు అశోక్, తల్లం శ్రీనివాసరావు, పెండ్యాల విజయ్, మాజేటి కిషోర్, గజవల్లి అంకారావు, అరవపల్లి శ్రీనివాసరావు తదితరులున్నారు.

మనస్థాపంతో యువకుడి ఆత్మహత్య

గుంటూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : గతంలో స్నేహితుల మధ్య జరిగిన గొడవలో నమోదైన కేసులో స్నేహితుడు చేసిన హేళనతో మనస్థాపానికి గురైన యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. లాలాపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని నల్లచెరువు 4/2కు చెందిన పేరుబోయిన నాగరాజు (28) తన ఇంటిలోనే ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నల్లచెరువు 4/2కు చెందిన నాగరాజు బీటెక్ చదువుకున్నాడు. గతంలోనే తండ్రి మృతి చెందగా తల్లి సామ్రాజ్యంతో ఉంటున్నాడు. సామ్రాజ్యంకు కూతురు ఉండగా ఆమెకు వివాహమైంది. నాలుగు నెలల క్రితం అదే ప్రాంతానికి చెందిన తన స్నేహితుడు మురళితో నాగరాజుకు గొడవ జరిగి ఇద్దరు కొట్టుకున్నారు. దీనిపై లాలాపేట పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదులు చేసుకోగా పోలీసులు కేసులు నమోదు చేశారు. ఇదిలా ఉంటే మంగళవారం రాత్రి మురళి, నాగరాజు కలిసి మందు తాగి నాగరాజును ఉద్దేశించి మురళి హేళనగా మాట్లాడాడు. దీంతో మనస్థాపానికి గురైన నాగరాజు ఇంటికి వెళ్లి జరిగిన విషయాన్ని తల్లి సామ్రాజ్యంకు చెప్పాడు. ఈ క్రమంలో ఇంటిలోని హాల్లో నాగరాజు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై తల్లి సామ్రాజ్యం ఫిర్యాదు మేరకు లాలాపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

బీటెక్ విద్యార్థిని అదృశ్యం

శ్రీనగర్‌కి చెందిన వాగోలు చెల్సి అనే బీటెక్ విద్యార్థిని అదృశ్యమైంది. చెల్సి తిరుపతిలోని మోహన్‌బాబు యూనివర్సిటీలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతోంది. అయితే అక్కడ మానిపించి దగ్గరలోని వేరే కాలేజీలో చేర్చాలనే ఉద్దేశంతో గుంటూరు తీసుకువచ్చారు. కాగా 15న చెల్సి ఇంట్లో ఎవరికి చెప్పకుండా ఎటో వెళ్లిపోయింది. తల్లి క్రాంతి భారతి ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు మిస్సింగ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మంత్రి దుర్గేష్ నుంచి కందుకూరి రంగస్థల పురస్కారాలు అందుకుంటున్న గుంటూరు జిల్లాకు చెందిన బి.శ్రీనివాస్‌నాయక్, బి.నాగమణి, అమృతవర్షిణి, హరిబాబు, ఎ.ఆదినారాయణ, మల్లేశ్వరరావు, జి.లహరి, జి.విమలకుమారి, జి.నాగభూషణం



సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నసీర్

మాయాబజార్‌కు మంచి రోజులు

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

● రూ.50 లక్షలతో సీసీ రోడ్, డ్రెయిన్లకు శంకుస్థాపన

గుంటూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): గత 15 ఏళ్లుగా తట్టమట్టి కూడా పడని మాయాబజార్ సెంటర్‌కు మంచి రోజులు తీసుకొస్తున్నామని తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ చెప్పారు. గుంటూరులోని మాయాబజార్ నుంచి ఓల్డ్ క్లబ్ రోడ్డు వరకు రూ.50 లక్షలతో సీసీ రోడ్డు, సీసీ డ్రెయిన్స్ నిర్మాణానికి ఎమ్మెల్యే నసీర్ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాయాబజార్లోని వ్యాపారులతో ఆయన మాట్లాడారు. వ్యాపారాలు, ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా రోడ్డు నిర్మాణాన్ని చేపడుతున్నామని దానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి మేయర్ సజీలా, షౌకత్, కొనకళ్ళ సత్యం, కుదుస్, పద్మావతి, విజయ్, మాయాబజార్‌లోని వ్యాపారస్తులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంగళదాస్ నగర్లో ఎమ్మెల్యే నసీర్ ప్రజా దర్బార్

గుంటూరులోని మంగళదాస్ నగర్‌లో బుధవారం ఎమ్మెల్యే నసీర్ ప్రజా దర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మంగళదాస్‌నగర్‌లో ఉన్న కమ్యూనిటీ హాల్‌ను సీఎస్ఆర్ నిధుల ద్వారా త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. అన్ని సమస్యలను సంబంధిత అధికారుల ద్వారా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే ప్రజలకు భరోసా కల్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రిహానా, క్లస్టర్ ఇన్‌చార్జ్ వేల్పూరు కిరణ్, చట్టు కనకారావు, పల్లెపోగు రమేష్, చాట్ల విజయబాబు, బెనర్జీ మాస్టర్, ఇమ్రాన్, ఖాసీం, వాసు, చారి పాల్గొన్నారు.

శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణం ఆపేందుకు కుట్రలు

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి



నేతాజీ నగర్ చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, కమిషనర్

గుంటూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): గుంటూరు శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణ పనులు జరగకుండా కొంతమంది ప్రజల్లో అపోహలు సృష్టించి అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి మండిపడ్డారు. గుంటూరు నేతాజీ నగర్‌లో బుధవారం ఎమ్మెల్యే మాధవి, జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ చెరువును అభివృద్ధి చేయటానికి అనేకమంది దాతలు ముందుకు వస్తున్న నేపథ్యంలో, వారితో జీఎంసీ అనుసంధానం చేసుకుని త్వరలో అభివృద్ధి పనులు ప్రారంభిస్తామని చెప్పారు. శంకర్‌విలాస్ బ్రిడ్జి నిర్మాణంపై కొంతమంది ప్రజలలో అపోహలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని, రెండుమూడు రోజుల్లో గుంటూరు పశ్చిమ, తూర్పు, ప్రత్తిపాడు ఎమ్మెల్యేలు కమిషనర్‌తో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ప్రజల్లో నెలకొన్న అపోహలను తొలగిస్తామన్నారు. వేసవి దృష్ట్యా నియోజకవర్గంలో ప్రధాన కూడళ్లు, సిగ్నల్స్ వద్ద మూడు వైపుల గ్రీన్ మ్యాట్‌లు ఏర్పాటు చేసి వాహనదారులకు ఉపశమనం కలిగించే ప్రయత్నం చేయబోతున్నామన్నారు.

గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రజాదర్బార్ నిర్వహించి, ప్రజలు, పార్టీ నేతల నుంచి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కనపర్తి శ్రీనివాసరావు, వేములపల్లి శ్రీరామ్ ప్రసాద్, నూకవరపు బాలాజీ, కొమ్మినేని కోటేశ్వరరావు, లంకా ఉదయ్, కసుకుర్తి హనుమంతురావు, సుకవాసి శ్రీనివాసరావు, పాకలపాటి శ్రీకాంత్, కూసం కిరణ్ కుమార్‌రెడ్డి, శాంత రామ్, కృష్ణ ప్రసాద్, నున్న సురేష్, విజయలక్ష్మి, ప్రభు, ఆలయ కమిటీ పెద్దలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పశ్చిమ నియోజకవర్గం మోడల్‌గా తీర్చిదిద్దుతా

గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి) : గుంటూరు పశ్చిమ నియోజకవర్గం మోడల్‌గా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. గుంటూరు 42వ డివిజన్ ఎస్వీయన్ కాలనీలో రూ.2కోట్ల 26లక్షలతో బీటీ రోడ్డు, పైప్ లైన్, ఆర్‌సీసీ కల్వర్టు, సీసీ రోడ్డుకు శంకుస్థాపన, రూ.20 లక్షలతో తారక రామా నగర్, ఎస్వీఎన్ కాలనీ 6వ అడ్డ రోడ్డులో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే గళ్ళా మాధవి, కమిషనర్ పులి శ్రీనివాసులు బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పెమ్మసాని రవి, కార్పొరేటర్ వేములపల్లి శ్రీరాం ప్రసాద్(బుజ్జి), పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యర్థాలను రోడ్ల మీద వేయొద్దు

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, అక్టోబర్ 16(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలోని అపార్ట్‌మెంట్లు, కమ్యూనిటీ గృహ సముదాయాల నివాసితులు వ్యర్థాలను రోడ్ల మీద, ఖాళీ స్థలాల్లో వేయొద్దని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. బుధవారం పట్టాభిపురం, రవీంద్ర నగర్, శ్యామలానగర్, కృష్ణనగర్ తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. పారిశుధ్య, అభివృద్ధి పనులను పరిశీలించి, తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. శ్యామల నగర్ 3వ లైన్‌లోని ఓ అపార్ట్‌మెట్ వాచ్‌మెన్ వ్యర్థాలను పక్కన ఖాళీ స్థలంలో వేయడం గమనించిన కమిషనర్ శ్రీనివాసులు ఆ మేరకు స్థానికులు పలు సూచనలు చేశారు. కృష్ణ నగర్ పార్క్ లో వాకింగ్ ట్రాక్ మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని డీఈఈ శ్రీనివాస్‌ను ఆదేశించారు. ఏఈలు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు ఆయన వెంట ఉన్నారు.

నేడు జీఎంసీలో ప్రత్యేక గ్రీవెన్స్

గుంటూరు నగరపాలక సంస్థలో ప్రజారోగ్య, ఇంజినీరింగ్ కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి గురువారం సాయంత్రం 3 నుండి 4 గంటల వరకు ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ముందస్తు పన్ను చెల్లింపు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఆస్తి పన్ను ముందస్తుగా ఈ నెలాఖరులోపు ఏక మొత్తంగా చెల్లిస్తే 5 శాతం రాయితీ లభిస్తుందని, కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ఒమేగా హాస్పిటల్స్ ఆర్వీఆర్ జేసీ ఇంజినీరింగ్ కళాశాలలు ముందస్తు పన్ను నగదు చెక్కులను కమిషనర్‌కు అందజేశాయి. కమిషనర్ మాట్లాడుతూ ఒమేగా హాస్పిటల్స్ రూ.15,12,784, ఆర్వీఆర్ జేసీ ఇంజినీరింగ్ కాలేజీ రూ.16 లక్షల ముందస్తు పన్ను చెల్లించినట్లు తెలిపారు. ఆస్తి, ఖాళీ స్థలాల పన్ను బకాయి ఒకేసారి చెల్లిస్తే వడ్డీపై 50 శాతం రాయితీ ఈ నెలాఖరులోపు పొందవచ్చని చెప్పారు. పల్నాడు బస్టాండ్ వద్ద గల అన్న క్యాంటీన్‌ని ఆయన పరిశీలించారు. సిబ్బందికి తగు సూచనలు చేశారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలకు ఎంపికైన జేకేసీ విద్యార్థులు

గుంటూరు(విద్య), ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక జేకేసీ కళాశాల విద్యార్థులు హెచ్‌సిఎల్ సంస్థ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఉద్యోగాలు సాధించారని ప్రిన్సిపాల్ పి.గోపీచంద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలకు చెందిన విద్యార్థులు సాహిత్యవర్మ, ఎస్కే హఫ్సా, అమరకిషోర్, సయ్యద్ సమీరా, కె శ్రావ్య, తదితరులు ఉద్యోగాలు సాధించారని వెల్లడించారు. విద్యార్థులను కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, జాగర్లమూడి మురళీమోహన్ తదితరులు అభినందించారు.

గిల్టు నగల మన్నిక కోసం ఇలా చేయాలి..!

మారుతున్న ఫ్యాషన్ ట్రెండ్స్‌కు అనుగుణంగా ప్రస్తుతం రకరకాల గిల్టు నగలు అందుబాటులో ఉన్నాయి. చీర, గౌను, ట్రెండీ డ్రెస్ ఇలా ఏ అవుట్‌ఫిట్ మీదనైనా చక్కగా అమరుతాయి ఈ నగలు. తక్కువ బరువుతో సౌకర్యవంతంగా అనిపిస్తాయి. అందుకే మహిళలు వీటిని ఎక్కువగా ఇష్టపడుతున్నారు. ఎంతో ముచ్చట పడి కొనుక్కున్న గిల్టు నగలను ధరించేటప్పుడు చిన్న చిట్కాలు పాటిస్తూ సరైన పద్ధతిలో భద్ర పరచుకుంటే అవి ఎక్కువకాలం మన్నికగా ఉంటాయి. ఆ వివరాలు తెలుసుకుందాం...

- గిల్టు నగలకు తడి తగిలితే అవి బంగారు మెరుపును కోల్పోతాయి. అందుకే గొలుసులు, హారాలు, నెక్లెస్‌లు, గాజులు, ఉంగరాలను స్నానం చేసేటప్పుడు తీయడం మంచిది. చేతులు కడుక్కునేటప్పుడు కూడా వాటికి తడి తగలకుండా చూసుకోవాలి.
- మేకప్ ఉత్పత్తులు, మాయిశ్చరైజర్, పర్‌ఫ్యూమ్, లోషన్, డియోడరెంట్‌లు వాడేముందు గిల్టు నగలు ధరించకూడదు. అలా చేస్తే ఈ ఉత్పత్తుల్లోని రసాయనాల వల్ల నగలకు ఉన్న గోల్డ్ ప్లేటింగ్ తొలగిపోయి అవి నల్లబడే అవకాశం ఉంటుంది. మేకప్ పూర్తయి పర్‌ఫ్యూమ్ చల్లుకున్న అయిదు నిమిషాల తరవాతనే గిల్టు నగలు ధరించడం మంచిది.
- వేసవికాలంలో ఎక్కువగా చెమట పట్టే సమయాల్లో ఈ నగలు వేసుకోవద్దు. చెమట తగిలితే నగలు నలుపుతిరుగుతాయి.
- దుస్తులు ధరించిన తరవాతనే నగలు వేసుకోవాలి. లేదంటే దుస్తులకు ఉండే దారాలు, పోగులు పట్టుకుని నగలు విరిగిపోవచ్చు. నగల్లో ఉండే రాళ్లు, పూసలు రాలిపోవచ్చు.



- ఒకసారి ధరించిన నగలను భద్ర పరచేముందు వాటిని వెల్వెట్ వస్త్రం లేదా పలుచని కాటన్ గుడ్డతో మెల్లగా తుడవాలి. నగలకు అంటుకున్న చెమట, దుమ్ము లాంటి వాటిని పూర్తిగా తొలగించాలి. లేదంటే నగలు మెరుపును కోల్పోయి పాత బడతాయి.
- గిల్టు నగలను అన్నింటినీ ఒకే బాక్సులో పెట్టకూడదు. అలా పెడితే ఒకదానికి మరోటి రాసుకుని వాటి మీద గీతలు పడతాయి. మెరుపుదనం తగ్గుతుంది. నగలను వాటికి నిర్దేశించిన బాక్సుల్లో మాత్రమే జాగ్రత్త చేయాలి.
- ఈ నగలను గాలి, వెలుతురు చొరబడని పెట్టె లేదా సంచిలో పెట్టి ఉంచితే ఎక్కువకాలం మన్నికగా ఉంటాయి. పలుచని గుడ్డలో చుట్టి పెడితే వాటి మెరుపుదనం చాలాకాలం వరకూ నిలిచి ఉంటుంది.

అభిరుచి

ప్రపంచమంతా చుట్టేయాలని ఎవరికి ఉండదు!
కానీ ఎంతమందికి అది సాధ్యమవుతుంది?
అందుకే ఈ జంట విభిన్నంగా ఆలోచించింది.
పర్యాటక ప్రదేశాల సందర్శన కోసం ఇంటినే వదిలేసింది.
దానికి పెట్టే అద్దె డబ్బులతో... నిరంతరం పర్యటనల్లోనే గడుపుతోంది.
దీని వెనుక ఉన్న కథ ఏంటో జంటలో ఒకరైన **హేమని చావ్డా** మాటల్లోనే...

జగమంత కుటీరం మాది



"చదువుకొనే రోజుల్లో మార్కుల రేసులు... పోటీ పరీక్షలు... ఆ తరువాత వృత్తిపరమైన ఎదుగుదల కోసం అలుపెరుగని ప్రయత్నాలు... సగటు మనిషి జీవితం ఇదే కదా. చిన్నప్పటి నుంచీ చూసి చూసి విసుగెత్తిపోయాను. అందరిలా కెరీర్ వెంట పరుగెత్తడం... ఊహ తెలిసినప్పటి నుంచీ దాని కోసమే ప్రణాళికా రచనలో మునిగిపోవడం... డిగ్రీ చదివే రోజుల్లోనే జీవితం అంటే ఇది కాదనిపించింది. ఛత్తీస్‌ఘడ్ రాజధాని రాయ్‌పూర్ మాది. మూస ఉద్యోగాలకు భిన్నంగా చదువు అవ్వగానే ఆర్జేగా కెరీర్ ప్రారంభించాను. అందులో ఊహించినంత కిక్ దొరకలేదు. దాంతో ట్రావెల్ బ్లాగర్‌గా మారాను. తరచూ కొత్త ప్రాంతాలకు వెళ్లడం, అక్కడి ప్రత్యేకతలను సామాజిక మాధ్యమాల్లో అందరితో పంచుకోవడం... చాలా ఉత్సాహంగా, ఉల్లాసంగా అనిపించింది. దాంతో ఆర్జేగా స్వస్తి చెప్పి ట్రావెల్ బ్లాగింగ్‌కు పూర్తి సమయం కేటాయించాలని అనుకున్నాను.

ఆయనదీ అదే దారి...

ఇక నా భర్త సాగర్ పటేల్‌కు కూడా పర్యటనలంటే చాలా ఇష్టం. ఆయన సొంతూరు మధ్యప్రదేశ్‌లోని ఝబువా. భౌగోళిక సమాచార రంగంలో పని చేసేవారు. మా ఇద్దరినీ కలిపింది మా అభిరుచే. ఆయన ఆధ్యాత్మిక పర్యాటకంపై వీడియోలు చేసి ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్‌ల్లో అప్‌లోడ్ చేసేవారు. నేనేమో పిల్లా పెద్ద అందరూ కలిసి ఆస్వాదించే ప్రాంతాలను చుట్టివచ్చేదాన్ని. అనుకోకుండా ఇద్దరం ఒక ఊరు వెళ్లినప్పుడు కలిశాం. ముందు అభిరుచులు కలిశాయి. తరువాత మనసులు ముడిపడ్డాయి. రెండున్నరేళ్ల కిందట ఇద్దరం పెళ్లి చేసుకున్నాం. అప్పటివరకు విడివిడిగా పర్యటించిన మేము... పెళ్లి తరువాత నుంచి ఎక్కడికైనా కలిసి వెళుతున్నాం. మా వృత్తుల కంటే ఇలా విహరించడమే మాకు బాగా నచ్చింది. అందుకే ట్రావెల్ బ్లాగింగ్‌కే పూర్తి స్థాయి సమయం కేటాయించాలని నిర్ణయించుకున్నాం.

ఇల్లు ఖాళీ చేసి...

అంతకుముందు మేమిద్దరం అహ్మదాబాద్‌లోని ఓ అద్దె ఇంట్లో ఉండేవాళ్లం. నెలకు అద్దె 40 వేలు. మెయింటెనెన్స్, పని మనిషి, కరెంటు... మరో పది వేలు అయ్యేవి. ఇవి కాకుండా సరుకులు, ఇతర నిత్యావసర వస్తువులు...అన్నీ కలుపుకొంటే దాదాపు లెక్క లక్ష తేలేది. ఇంతా చేసి నెలలో కనీసం ఓ వారం రోజులు కూడా మేం ఇంట్లో ఉండేవాళ్లం కాదు. పెళ్లయ్యాక మొదటి ఏడాదంతా జీవితంలో స్థిరపడాలనే ప్రయత్నాలతోనే సరిపోయింది. దాని కోసం ఎన్నో ప్రణాళికలు. లేచింది మొదలు మెదడులో ఇవే తిరుగుతుండేవి. ఇలాంటి జీవితం కాదు కదా నేను కోరుకున్నది! ఒక రోజు కూర్చొని ఆలోచిస్తుంటే... ఇద్దరి దారి, గమ్యం ఒకటే అయినప్పుడు ఇవన్నీ అవసరమా అనిపించింది. నెల తిరిగే సరికి ఇంత ఖర్చు భరించడం అంటే... తెలియకుండానే మాపై ఆర్థికంగా, మానసికంగా ఒత్తిడి పెరుగుతోంది. దీనివల్ల చేసే పని మీద ఏకాగ్రత కుదరడం లేదు. అన్నీ బేరీజు వేసుకున్నాక... ఇల్లు ఖాళీ చేయాలనే నిర్ణయానికి వచ్చాం. మాకున్న కొద్దిపాటి సామాను అత్తగారి ఇంట్లో పెట్టాం.

అద్దె డబ్బుతో...

ఇకపై పూర్తిగా పర్యటనల్లోనే గడపాలని ఇద్దరం అనుకున్నాం. అలా ఐదు నెలల కిందట ఇల్లు ఖాళీ చేసేశాం. అప్పటి నుంచి నిరంతరాయంగా ఊళ్లు తిరుగుతున్నాం. ఇప్పుడు మాకంటూ ఒక ఇల్లు లేదు. మేం ఎక్కడికి వెళితే అక్కడే మా నివాసం. ఎలాంటి బరువు, బాధ్యతలూ లేవు. నెల నెలా మేం కట్టే అద్దె డబ్బులతో నచ్చిన ప్రాంతాలన్నీ సందర్శిస్తున్నాం. 'మేం ఇలా గడపాలనుకున్నాం' అని మా పెద్దవాళ్లను కూడా ఒప్పించాం. అప్పుడప్పుడూ వారిని కూడా మాతో తీసుకువెళుతుంటాం. కొన్ని ఊళ్లకు తరచూ వెళుతుండంవల్ల స్థానికులతో పరిచయాలు ఏర్పడ్డాయి. దానివల్ల కొన్నిసార్లు కొత్త ప్రాంతానికి వెళ్లిన అనుభూతి కలగదు. అంతా మనవాళ్లే అనిపిస్తుంది. అలాగే బయటివారి కంటే తక్కువ ధరకే వసతి దొరుకుతోంది. మా ప్రయాణ ఖర్చులు, అక్కడి హోటల్‌లో బస, భోజనం... అన్నీ కలుపుకొంటే మేం కట్టిన అద్దె డబ్బు కంటే మించడంలేదు. సరుకులు కొనాల్సిన అవసరం లేదు. ఇద్దరికీ కలిపి ఒక సూట్‌కేస్, ఒక బ్యాక్‌ప్యాక్. ఇదే మా సంసారం.

ప్రయోగాత్మకంగా...

మేం మొదలుపెట్టినప్పుడు ఎన్ని రోజులు కొనసాగిస్తామో తెలియదు. ప్రయోగాత్మకంగా ఏడాది పాటు ఇలా చేసి చూద్దామని అనుకున్నాం. ఐదు నెలలు గడిచిపోయాయి. రోజు రోజుకూ ఉత్సాహం, ఆసక్తి పెరుగుతున్నాయే కానీ తగ్గడంలేదు. కుదిరితే జీవితాంతం ఇలా పర్యటనల్లోనే గడిపేయాలని కోరుకొంటున్నాం. పర్యటిస్తూనే మేం సంపాదించుకొంటున్నాం. వెళ్లదలుచుకున్న చోట రెస్టారెంట్లు, దర్శనీయ స్థలాల నిర్వాహకులను సంప్రతిస్తాం. వారు కోరితే వాటికి ప్రచారం కల్పిస్తాం. వారి సామాజిక మాధ్యమాల ఖాతాలను నిర్వహిస్తాం. సాంకేతికంగా మాకు మంచి నైపుణ్యం ఉంది. ఈ సేవలకు గానూ వారు మాకు కొంత మొత్తం చెల్లిస్తారు. రెస్టారెంట్లు, కేఫ్‌ల్లో తాత్కాలికంగా హెల్పర్‌గా పని చేస్తాం. ఇవే మా ఆదాయ మార్గాలు.



లక్షల్లో ఫాలోవర్స్...

ప్రస్తుతం మేం తీసే వీడియోలన్నీ నా ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తున్నాం. అక్కడ నాకు దాదాపు మూడున్నర లక్షల మంది ఫాలోవర్స్ ఉన్నారు. ట్రావెల్ బ్లాగింగ్‌ను ఫుల్‌టైమ్ కెరీర్‌గా మార్చుకున్నాక ఫాలోవర్స్ విపరీతంగా పెరిగారు. మా ఆలోచనకు అభినందనలు తెలుపుతున్నారు. 'మీది సాహసోపేత నిర్ణయం' అంటూ పొగుడుతున్నారు. ఆ కామెంట్లు చూసినప్పుడు... 'ఇల్లు, కెరీర్‌ను వదిలేసి కొత్త మార్గంలో పయనిస్తున్నామంటే... నిజంగానే మాది సాహసమే కదా' అనిపిస్తుంది. అయితే జీవితం మొత్తాన్నీ ఒక సూట్‌కేసులో పెట్టేసి జీవించడమంటే అంత సులువు కాదు. కానీ ఒక్కటి నిజం... లగేజీ ఎంత తక్కువ ఉంటే ప్రయాణం అంత సౌకర్యంగా ఉంటుంది. ఏదిఏమైనా మా పర్యాటక అభిరుచిని జీవితాంతం కొనసాగించాలన్నదే మా ధ్యేయం. ఎందుకంటే ఇలాంటి అద్భుత అవకాశం అందరికీ రాదు కదా."



ఆరాధ్యుల వెంకటేశ్వరరావు, గుర్రాల రవికృష్ణలకు పురస్కారాలు అందజేస్తున్న మంత్రి దుర్గేశ్

సాంస్కృతిక వైభవాన్ని పునరుద్ధరిస్తాం

» సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి దుర్గేశ్

» నాటక రంగంలో 113 మందికి 'కందుకూరి' పురస్కారాలు

విజయవాడ కల్చరల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కళలు, సాంస్కృతిక వైభవాన్ని పునరుద్ధరిస్తామని పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేశ్ పేర్కొన్నారు. కందుకూరి 177వ జయంతి సందర్భంగా ఏపీ రాష్ట్ర చలనచిత్ర, టీవీ, నాటకరంగ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బుధవారం 'తెలుగు నాటక రంగ దినోత్సవం-2025' ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గేశ్ మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో నాటకానికి ఓ ప్రత్యేకమైన స్థానాన్ని కల్పించి, నాటకానికి సామాజిక ప్రయోజనం ఉండాలని విశ్వసించిన రచయిత వీరేశలింగం పంతులు అని కొనియాడారు. తెలుగులో మొట్టమొదటి నాటకం రాసిన కందుకూరిని నాటకరంగ ఆద్యుడుగా అభివర్ణించారు. నాటక రంగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 113 మందికి మంత్రి అవార్డులు ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. రాష్ట్రస్థాయిలో ముగ్గురికి కందుకూరి ప్రతిష్టాత్మక రంగస్థల పురస్కారాలు, జిల్లాస్థాయిలో 110 మందికి కందుకూరి విశిష్ట పురస్కారాలను అందజేశారు.

సచివాలయం, ఐకానిక్ టవర్ల నిర్మాణానికి టెండర్లు

» మే 1న టెక్నికల్ బిడ్లను తెరవనునన్న సీఆర్డీఏ

విజయవాడ, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): అమరావతిలో నిర్మించతలపెట్టిన సచివాలయం, జీఏడీ ఐకానిక్ టవర్ల నిర్మాణానికి సీఆర్డీఏ టెండర్లు పిలిచింది. సచివాలయం కోసం 4 టవర్లు, జీఏడీ టవర్‌కు వేర్వేరుగా టెండర్ నోటిఫికేషన్లు ఇచ్చింది. మొత్తంగా రూ.4,668 కోట్లతో 5 టవర్లను డయాగ్రిడ్ మోడల్‌లో నిర్మించనున్నారు. సచివాలయ 4 టవర్లను బేస్‌మెంట్+39 ఫ్లోర్లు+టెర్రస్ నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటిలో 1, 2 టవర్లను 28,41,675 చదరపు అడుగుల విస్తీర్ణం, 3, 4 టవర్లను 23,42,956 చదరపు అడుగుల విస్తీర్ణంతో నిర్మించనున్నారు. సీఎం కార్యాలయం ఉండే కీలకమైన జీఏడీ టవర్‌ను బేస్‌మెంట్+47 ఫ్లోర్లు+హెలిప్యాడ్‌తో కలిపి మొత్తం 17,00,3000 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించనున్నారు. జీఏడీ టవర్ నిర్మాణానికి రూ.1,126 కోట్లు, సచివాలయం ఒకటి, రెండు టవర్ల నిర్మాణానికి రూ.1,897 కోట్లు, సచివాలయం టవర్ల కోసం రూ.1,664 కోట్లతో వేర్వేరుగా టెండర్ నోటిఫికేషన్‌ను జారీ చేశారు. మే 1వ తేదీన సచివాలయం, జీఏడీ టవర్ల టెక్నికల్ బిడ్లను సీఆర్డీఏ తెరవనుంది.

పవన్ కల్యాణ్, మార్క్ శంకర్‌పై అసభ్య పోస్టులు పోలీసుల అదుపులో కర్నూలు జిల్లా వాసి

» నిందితుడు అల్లు అర్జున్ అభిమానిగా గుర్తింపు

గుంటూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఆయన కుమారుడు మార్క్ శంకర్‌పై సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర పోస్టులు పెట్టిన కేసులో కర్నూలు జిల్లా గూడూరుకు చెందిన పుట్టపాశం రఘు అలియాస్ పుష్పరాజ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం గుంటూరు జిల్లా ఎస్పీ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాలు.. ప్రత్తిపాడుకి చెందిన సాంబశివరావు ఫిర్యాదు మేరకు రఘుని రెస్టు చేశామన్నారు. రఘు.. అల్లు అర్జున్‌కు వీరాభిమాని అని తెలిపారు. 2024 ఎన్నికల సమయంలో అర్జున్ నంద్యాలకు వచ్చి వైసీపీ అభ్యర్థికి మద్దతు తెలిపారు. దీంతో మెగా అభిమానులు అర్జున్‌ని విమర్శించారు. దీంతో రఘు.. మెగా కుటుంబంలోని వ్యక్తులపై అసభ్యకర పోస్టులు పెట్టేవాడని ఎస్పీ పేర్కొన్నారు. ఈ క్రమంలోనే ఈ నెల 8న పవన్ కల్యాణ్ చిన్నకుమారుడు మార్క్ శంకర్‌కు సింగపూర్‌లో అగ్ని ప్రమాదం జరిగిందని, ఇదే అదునుగా మెగా కుటుంబంపై ద్వేషాన్ని వెళ్లగక్కుతూ అనుచిత వ్యాఖ్యలు పోస్టు చేశాడని తెలిపారు.

విశాఖ కేంద్రంగా ప్రకటించిన దక్షిణ కోస్తా రైల్వే జోన్ పనులు ఒక అడుగు ముందుకు.. రెండు అడుగులు వెనక్కి అన్న చందంగా తయారయ్యాయి. విశాఖలో రైల్వే జోన్ ఏర్పాటు చేయడం ఒడిశాలోని తూర్పు కోస్తా జోన్ అధికారులకు అది నుంచీ ఇష్టం లేదు. రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ కూడా ఆ రాష్ట్రానికి చెందిన వారే కావడంతో వారు అనుకున్నట్టుగానే చేస్తున్నారు. దీంతో గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు.



విశాఖ రైల్వే జోన్‌కు గెజిట్ ఏదీ?

ఒడిశా అధికారుల మోకాలడ్డు

» కొత్తవలసను కూడా రాయగడ
» డివిజన్‌లో చేర్చాలని డిమాండ్
» మళ్లీ ఆగిన జోనల్ ఆఫీస్ పనులు
» ఉమ్మడి జిల్లాలో రైల్వే స్టాండింగ్
» కమిటీ చైర్మన్ ఉన్నా ప్రయోజనం నిల్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖ రైల్వే జోన్ ప్రకటించిన తర్వాత విశాఖలో కార్యాలయం నిర్మాణానికి శంకుస్థాపన చేయడానికి ఏళ్ల సమయం పట్టింది. రాష్ట్రంలో సీఎం చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడ్డాక రైల్వే జోన్‌కు అవసరమైన భూ వివాదాలు పరిష్కరించి అధికారికంగా ముడసర్లోవలో 52 ఎకరాలు అప్పగించింది. దీనిలో కార్యాలయ సముదాయం నిర్మాణానికి ఈ ఏడాది జనవరి 8న ప్రధాని నరేంద్రమోదీ చేతులమీదుగా శంకుస్థాపన చేశారు. రైల్వే జోన్ భవన నిర్మాణానికి రూ.149 కోట్లతో టెండర్లు పిలిచారు. కాంట్రాక్టర్ అక్కడ పనులు ప్రారంభించగా వివాదాలు మొదలయ్యాయి. ఆ భూమి తమదంటూ కొందరు గిరిజనులు పనులను అడ్డుకున్నారు. దీంతో ఎక్కడి యంత్రాలు అక్కడే ఆగిపోయాయి. వైసీపీ హయాంలోనూ గిరిజనులు ఇలాగే అడ్డుపడ్డారు. వారికి ఆ భూములపై హక్కులు లేవని అధికారులు నిర్ధారించారు. అయితే, తాము చాలా కాలంగా ఇక్కడే జీవిస్తున్నామని, ప్రత్యామ్నాయం చూపించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. సొంత భవనంతో సంబంధం లేకుండా రైల్వే జోన్‌ను ఆపరేషన్ చేసుకునే అవకాశం ఉంది. వాస్తవానికి రైల్వేలో ఏదైనా కొత్త జోన్ ఏర్పాటు చేసినప్పుడు దానికి సంబంధించి అధికారికంగా ఒక గెజిట్ విడుదల చేస్తా రు. దీనిలో న్యాయపరమైన అంశాలు ఉంటాయి. జోన్ పరిధి, హద్దులు, ఆపరేషన్ తేదీ, తదితర వివరాలు పేర్కొంటారు. గతంలో అన్ని జోన్లకు గెజిట్ ప్రకటించాకే పనులు ప్రారంభించారు. విచిత్రంగా విశాఖలోని దక్షిణ కోస్తా జోన్‌కు మాత్రం ఇప్పటివరకు గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వలేదు. 3 నెలలైనా దాని గురించి ఎవరూ ప్రశ్నించడం లేదు. జోనల్ కొత్త కార్యాలయం నిర్మాణం రెండేళ్లలో పూర్తిచేయాలని నిబంధన పెట్టారు. కానీ, మూడు నెలలైనా అక్కడ మొక్కలు కూడా తొలగించలేదు. గెజిట్‌లో 'ఆపరేషన్ డేట్' ప్రకటిస్తే దాని ప్రకారం రైల్వే అధికారులు పూర్తి చేయాల్సి ఉంటుంది. కానీ, ఉద్దేశపూర్వకంగా గెజిట్ ప్రకటించకుండా తొక్కి పెట్టారు.

కొత్తవలస కావాలని పేచీ

దక్షిణ కోస్తా జోన్ ప్రకటించిన సందర్భంలో వాల్తేరు డివిజన్‌ను విడగొట్టి కొత్తగా ఒడిశాలోని రాయగడ కేంద్రంగా మరో డివిజన్ ఏర్పాటు చేశారు. విజయనగరం జిల్లా కొత్తవలస నుంచి అరకు వరకు రాయగడ డివిజన్‌లో చేర్చారు. అయితే, తాజాగా కొత్తవలస స్టేషన్‌ను కూడా ఈ డివిజన్‌కే ఇవ్వాలని తూర్పు కోస్తా జోన్ అధికారులు భువనేశ్వర్ నుంచి ఒత్తిడి చేస్తున్నారు. దీనికి బలమైన కారణం ఉందన్న చర్చ సాగుతోంది. ఆ పరిసరాల్లో రైల్వే వ్యాగన్ డిపో త్వరలో ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. దీంతో కొత్తవలస స్టేషన్ కూడా తమ పరిధిలో చేర్చాలని డిమాండ్ చేస్తున్నారు. అదయ్యాకే గెజిట్‌ను విడుదల చేయించాలనేది ఒడిశా నేతల ప్రణాళికగా ఉన్నట్టు సమాచారం.

మన నేతలు ఏం చేస్తున్నట్టు?

రైల్వే జోన్‌కు శంకుస్థాపన చేసేశాం కాబట్టి తమ పని అయిపోయిందని ఉత్తరాంధ్రకు చెందిన నాయకులు భావిస్తున్నారు. అనకాపల్లి ఎంపీగా ఉన్న సీఎం రమేశ్ సాక్షాత్తూ రైల్వే స్టాండింగ్ కమిటీకి చైర్మన్. ఆయన దీనిపై దృష్టి పెడితే రెండు రోజుల్లో గెజిట్ నోటిఫికేషన్ ఇప్పించే అవకాశం ఉంది. ఉత్తరాంధ్రాలోనే కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు ఉన్నారు. ఆయన ఢిల్లీ పెద్దలతో మాట్లాడినా గెజిట్ విడుదల అవుతుంది. ఆ దిశగా దృష్టి పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

లైవ్‌లో అశ్లీల వీడియోలు

» నిషేధిత వెబ్‌సైట్‌కు అమ్ముతున్న ముఠా

» బెంగళూరు కేంద్రంగా ఇద్దరు.. గుంతకల్లులో మరొకరు దందా

» పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నామన్న ఈగల్ చీఫ్ రవికృష్ణ

గుంటూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): నిషేధిత అశ్లీల వెబ్‌సైట్‌లో మహిళల నగ్న వీడియోలు ప్రత్యక్ష ప్రసారం చేస్తూ సొమ్ము చేసుకుంటున్న ముగ్గురి గుట్టురట్టయింది. రెండేళ్లుగా ఈ అశ్లీల దందా నిర్వహిస్తున్న శ్రీకాకుళం జిల్లా పాతపట్నానికి చెందిన గణేశ్, జ్యోత్స్న, గుంతకల్లుకు చెందిన లూయిస్‌లను పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం వారిని మీడియా ఎదుట ప్రవేశపెట్టారు. వారి దందా వివరాలను ఈగల్ చీఫ్, సైబర్ క్రైమ్ ఇన్‌చార్జ్ ఐజీ ఆకే రవికృష్ణ గుంటూరులోని సీఐడీ కార్యాలయంలో వివరించారు. గణేశ్, జ్యోత్స్న డిగ్రీ చదువుకొని సులువుగా డబ్బు సంపాదించే మార్గాలను అన్వేషించారు. బెంగళూరు కేంద్రంగా సైప్రస్ దేశానికి చెందిన నిషేధిత ఎక్స్‌హ్యామ్‌స్టర్ వెబ్‌సైట్ ద్వారా మహిళల నగ్న వీడియోలను లైవ్ స్ట్రీమింగ్ చేస్తున్నారు. గుంతకల్లులో కాల్ సెంటర్ నిర్వహిస్తున్న లూయిస్ అనే వ్యక్తి కూడా ఈ అశ్లీల వీడియోల దందా నిర్వహిస్తున్నాడు. ఈ ముగ్గురికి వెబ్‌సైట్ నిర్వాహకులు క్రిప్టో కరెన్సీ బిట్‌కాయిన్‌లో చెల్లింపులు చేస్తే.. వాటిని డాలర్లలోకి, ఆపై రూపాయల్లోకి మార్చుకుంటున్నారు. ఇప్పటి వరకు బెంగళూరుకు చెందిన ముఠా రూ. 16 లక్షలు, లూయిస్ రూ. 11 లక్షలు సంపాదించారని పోలీసుల విచారణలో తేలింది. తమకు అందిన సమాచారం మేరకు సీఐడీ సైబర్ క్రైమ్ ఎస్పీ కృష్ణ ప్రసన్న ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది బెంగళూరులోని గణేశ్, జ్యోత్స్న స్టూడియోపై దాడి చేసి లైవ్ స్ట్రీమింగ్ పరికరాలు, వెబ్ కెమెరాలు, పోర్న్ వీడియోల డేటా సీజ్ చేశారు. ఇక్కడ ప్రస్తుతానికి ముగ్గురు మహిళా బాధితులను గుర్తించారు. ఈ ముఠాపై ఇప్పటివరకు మూడు ఫిర్యాదులు నమోదయ్యాయని, దర్యాప్తు కొనసాగుతోందని, ఎంత మంది బాధితులు ఉన్నారనేది త్వరలోనే తెలియజేస్తామని ఐజీ ఆకే రవికృష్ణ తెలిపారు. ఈ మొత్తం వ్యవహారంపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

సైబర్ క్రైమ్ బాధితులు 1930కు ఫిర్యాదు చేయొచ్చు

ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఆకే రవికృష్ణ సూచించారు. ఇటీవల బెట్టింగ్ యాప్స్, డిజిటల్ అరెస్టులు, ఓటీపీ ఫ్రాడ్ తదితర ఆర్థిక నేరాలు జరుగుతున్నాయన్నారు. అందువల్ల వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. సైబర్ నేరాలకు సంబంధించి 1930 కాల్ సెంటర్‌కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. న్యాయం జరగని పక్షంలో మంగళగిరిలోని సీఐడీ ప్రధాన కార్యాలయానికి రావచ్చన్నారు. సోషల్ మీడియాలో అసభ్యకరంగా పోస్టు పెడితే పదేళ్ల తరువాత అయినా అరెస్టు కాక తప్పదని హెచ్చరించారు. యువత డ్రగ్స్, గంజాయి వంటి మాదక పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. వాటిపై ఫిర్యాదుల కోసం ప్రత్యేకంగా 1972 అనే టోల్ ఫ్రీ నంబర్ ఉందన్నారు. ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు మందులను విక్రయించవద్దని మందుల షాపులకు సూచించారు. తల్లిదండ్రులూ పిల్లల విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. సమావేశంలో ఎస్పీ కృష్ణ ప్రసన్న, డీఎస్పీ గోలి లక్ష్మయ్య పాల్గొన్నారు.

మూడేళ్లలో ఏపీ పోలీసుల్లో 33% మహిళలు

» మిగతా రాష్ట్రాలు 24 ఏళ్లకు గానీ కోటా చేరుకోలేవు

» ఇండియా జస్టిస్ నివేదిక-2025 వెల్లడి

అమరావతి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): పోలీసు వ్యవస్థలో మహిళా రిజర్వేషన్ కోటా 33 శాతాన్ని ఇప్పటి వరకు ఏ రాష్ట్రం, కేంద్ర పాలిత ప్రాంతం కూడా సాధించలేదని ఇండియా జస్టిస్ నివేదిక-2025 వెల్లడించింది. మరో మూడేళ్లలో ఆంధ్రప్రదేశ్, బిహార్ రాష్ట్రాల్లో 33 శాతానికి చేరుకుంటుందని తెలిపింది. అదే సమయంలో మిగతా రాష్ట్రాలు ఈ కోటాను పూర్తిగా అమలు చేయడానికి కనీసం మరో 24 ఏళ్ల అవుతుందని, జార్ఖండ్, త్రిపుర, అండమాన్-నికోబార్‌కు అయితే 200 ఏళ్ల పడుతుందని పేర్కొంది.

నివేదికలోని వివరాలు

- దేశవ్యాప్తంగా 17 శాతం పోలీసు స్టేషన్లలో సీసీటీవీ కెమెరాలు, 30 శాతం స్టేషన్లలో మహిళా హెల్ప్ డెస్కులు లేవు.
- పోలీసు వ్యవస్థలో లింగ వివక్ష అధికంగా ఉంది. దేశవ్యాప్తంగా ఉన్నత స్థాయి పోస్టుల్లో ఉన్న మహిళలు 8 శాతం మాత్రమే. ఏపీలో జాతీయ సగటు కంటే కూడా తక్కువగా ఉంది. ఏపీలో సగటున పోలీసు స్టేషన్‌కు మహిళా ఎస్‌ఐలు 0.2 శాతం, మహిళా కానిస్టేబుళ్లు 2.5 శాతం మాత్రమే.
- ఏపీలో మొత్తం పోలీసు ఉద్యోగుల్లో మహిళలు 21.5 శాతం, పోలీసు అధికారుల్లో 5.2 శాతం, జైలు ఉద్యోగుల్లో 8.4 శాతం ఉన్నారు.
- న్యాయవ్యవస్థలో పెండింగ్ కేసుల సంఖ్య ఎక్కువగా ఉంది. బిహార్‌లో మూడేళ్ల నుంచి పెండింగ్ కేసులు 71 శాతం ఉన్నాయి.
- ఏపీలో కింది కోర్టుల్లో మూడేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న కేసులు 33.5 శాతం. హైకోర్టులో ఐదేళ్ల నుంచి పెండింగ్ కేసులు 50.7 శాతం, 10-20 ఏళ్లలో పెండింగ్‌లో ఉన్నవి 26.7 శాతం, 20 ఏళ్లకు పైగా పెండింగ్‌లో ఉన్నవి 22.5 శాతం ఉన్నాయి.
- 10 లక్షల మంది ప్రజలకు 50 మంది జడ్జిలు అవసరం కాగా, ప్రస్తుతం 15 మంది జడ్జిలు మాత్రమే ఉన్నారు. ఏపీలో జడ్జి, ప్రజల నిష్పత్తి 10.5 శాతంగా ఉంది. ఇది 50 శాతం ఉండాలి.



- జిల్లా న్యాయస్థానాల్లో మహిళా జడ్జిలు 38 శాతం ఉన్నారు.
- ఏపీ హైకోర్టు జడ్జిల్లో మహిళలు 16.7 శాతం, సబ్ కోర్టుల్లో 50.9 శాతం ఉన్నారు.
- పోలీసు, న్యాయ వ్యవస్థల్లో ఎస్సీ ఎస్టీ, ఓబీసీ కోటాను అమలు చేసిన ఏకైక రాష్ట్రం కర్ణాటక.
- దేశవ్యాప్తంగా మహిళా పోలీసుల్లో 89 శాతం మంది కానిస్టేబుల్ స్థాయిలోనే ఉన్నారు.



దుగ్గిరాల యార్డులో పసుపు ధరలు

దుగ్గిరాల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాల వ్యవసాయ మార్కెట్ కమి టీ యార్డులో బుధవారం జరిగిన వేలంలో 572 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.10,750, గరిష్ఠధర రూ.12,200, మోడల్‌ధర రూ.11,700 పలికాయి. కాయ కనిష్ఠధర రూ.10,750, గరిష్ఠధర రూ.12,200, మోడల్‌ధర రూ.11,700 పలికాయి.

డీఎస్సీ నుంచే వర్గీకరణ అమలు జరపాలి



సమావేశంలో పాల్గొన్న మాదిగ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్లు

మంగళగిరి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): త్వరలో విడుదల కానున్న మెగా డీఎస్సీ నుంచే ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్లు అమలుచేయాని ఏపీ మాదిగ వెల్ఫేర్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్లు కోరారు. మంగళగిరిలో బుధవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు ఆర్డినెన్స్ జారీచేయాలని రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకోవడంపై హర్షం వ్యక్తంచేశారు. గ్రూపు-1లో రెల్లితోపాటు 12 ఉపకులాలకు ఒక శాతం, గ్రూపు-2లో మాదిగ, 18 ఉపకులాలకు 6.5శాతం, గ్రూపు-3లో మాల, 29 ఉపకులాలకు 7.5శాతం రిజర్వేషన్లు అమలుచేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో డైరెక్టర్లు గన్నెపాటి మల్లేష్, పడ్లపల్లి గంగాధరప్ప, వేమగిరి వెంకటరావు, ఈతలపాక సుజాత, బేతపూడి విజయశేఖర్, మండవల్లి చంద్రశేఖర్, వల్లూరి రాజారవీంద్ర పాల్గొన్నారు.



కందుకూరి వీరేశలింగం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నిర్వాహకులు

తెలుగుజాతి నవయుగ వైతాళికుడు కందుకూరి

● ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ మోహనరావు

పెదనందిపాడు, ఏప్రిల్, 16 (ఆంధ్రజ్యోతి): తెలుగునాట సంస్కరణల ఆద్యుడు తొలి నాటక ప్రదర్శన కర్త కందుకూరి వీరేశలింగం అని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ గేరా మోహనరావు అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో కందుకూరి 177వ జయంతిని మంగళవారం నిర్వహించారు. కందుకూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గేరా మాట్లాడుతూ నాటి సమాజంలో మూఢనమ్మకాలపై పోరాటాలు చేసి గొప్ప సంఘసంస్కర్తగా కందుకూరి నిలిచిపోయారన్నారు. గ్రంథాలయ అధికారి పి.సుభాషిణి, విశ్రాంత ఉపాధ్యాయులు గుగ్గిలం సాయిబాబు, మేడూరి సుబ్బారావు, ఏ విజేంద్రరావు, వెంకటేశ్వర్లు, సునీల్, మంజుల పాల్గొన్నారు.

కథోలిక్‌ల తపస్సు కాల పాదయాత్ర

వట్టిచెరుకూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముట్లూరు పునీతశౌరివారి దేవాలయం నుంచి కథోలిక్ విశ్వాసులు లేమల్లెపాడు ఎస్సీ కాలనీ వద్ద జేసుతిరు హృదయ ఆలయం వరకు బుధవారం పాదయాత్ర నిర్వహించారు. గత నెల 5వ తేదీ నుంచి ఈనెల 18తో ముగియనున్న తపస్సు కాల దీక్ష నేపథ్యంలో ముట్లూరు పునీతశౌరివారి దేవాలయం ఫాదర్ దిలీప్‌కుమార్ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా పాతరెడ్డిపాలెం చర్చి ఫాదర్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

'రజక సంఘం' రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలి

తాడేపల్లి(ఉండవల్లి), ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర 7వ మహాసభలను జయప్రదం చేయాలని ఉండవల్లిలో సంఘ ప్రతినిధులు బుధవారం కరపత్రాలు పంపిణీ చేశారు. ఎంటీఎంసీ నగర కమిటీ అధ్యక్షుడు ఉండవల్లి పార్థసారథి మాట్లాడుతూ పలు సమస్యలు పరిష్కారానికి, రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై ఈ నెల 20, 21 తేదీల్లో కొండపల్లిలో జరగనున్న మహా సభలలో చర్చించి, తగు నిర్ణయం తీసుకుంటామన్నారు. పలువురు ఎమ్మెల్యేలు, సంఘం నేతలు పాల్గొంటారని తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమంలో నేతలు వల్లభాపురం వెంకటేశ్వరరావు, మస్తాన్‌రావు, మునిపల్లె సాంబశివరావు, తాడేపల్లి శ్రీనివాసరావు, ధనుంజయరావు, మల్లేశ్వరరావు, శివపార్వతి, చెంచమ్మ, జ్యోతి, జయమ్మ, వంకట రత్నమ్మ, లక్ష్మి, బొజ్జా సుబ్బారావు పాల్గొన్నారు.

అభివృద్ధి మాటున మట్టి అక్రమ తవ్వకాలు



పాములపాడు చెరువులో మట్టి తవ్వకాలు చేస్తున్న దృశ్యం

● చెరువు కట్టల బలోపేతం పేరుతో మట్టి అమ్మకాలు
● అధికారపార్టీ నాయకుడి నిర్వాకం
● తవ్వకాలను అడ్డుకున్న పోలీసులు

తాడికొండ, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పేరిట మట్టి అక్రమ తవ్వకాలు జరిపి జేబులు నింపుకునే పనిలో ప్రజా ప్రతినిధులు ఉన్నారు. ప్రకృతి సంపదను కాపాడాల్సిన అధికార యంత్రాంగం అక్రమార్కులకు కొమ్ముకాస్తు చోద్యం చూస్తోంది. మండలంలోని పాములపాడు గ్రామంలోని మంచినీటి చెరువు కట్టలు బలోపేతం పేరుతో తీర్మానాలు చేశారు. వైసీపీ నాయకులతో అధికార పార్టీ నాయకుడు చేతులు కలిపి.. ఈ మట్టి తవ్వకాలను యధేచ్ఛగా కొనసాగిస్తున్నారు. గ్రామంలో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు తీర్మానాలు చేసి, చెరువు మట్టిని ప్రైవేటు వ్యక్తులకు విక్రయించి దందా సాగిస్తున్నారు. ట్రక్కు మట్టి సుమారు రూ.600 లకు అమ్ముతున్నట్లు సమాచారం. సీనరేజ్ కింద మరో రూ.200 లు తీసుకుంటున్నారు. గ్రామాల్లో పొలాలకు, ప్రైవేటు స్థలాలకు ఈ మట్టిని విక్రయిస్తున్నారు. మట్టి అక్రమ తవ్వకాలపై ఫిర్యాదు అందడంతో.. పోలీసులు అడ్డుకున్నారు. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ట్రాక్టర ద్వారా అక్రమంగా తరలిస్తున్న మట్టి

రామానగర్ కాలనీలో విద్యుత్ సమస్యలకు పరిష్కారం

● 15 లక్షలతో కాలనీలో విద్యుత్ స్తంభాల మార్పు ● పనులను ప్రారంభించిన టీడీపీ నాయకులు

ప్రత్తిపాడు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఎన్నో సంవత్సరాలుగా ఉన్న విద్యుత్ సమస్యకు ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు పరిష్కారం చూపారు. ప్రత్తిపాడులోని రామానగర్ కాలనీలో విద్యుత్ స్తంభాలు ఒరిగి పోవడంతో పాటు సీసీ రోడ్ల ఏర్పాటు చేయడం వల్ల రోడ్డు పైకి ఎప్పుడో వేసిన స్తంభాలు కిందికి వచ్చాయి. దీంతో ట్రాక్టర్లు, వాహనాలు రోడ్డుపైకి వచ్చిన సమయంలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. దీనికి తోడు కండక్టర్లు (విద్యుత్ వైర్) ఎప్పుడో వేసినది కావడంతో తరచుగా తెగిపోతున్నాయి. ఈ పరిస్థితులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లిన మరుక్షణమే రూ.15లక్షలు మంజూరు చేయించారు. కాలనీలో సుమారు 40 విద్యుత్ స్తంభాలతో పాటు 6 కిలోమీటర్ల మేర పాత కండక్టర్ స్థానంలో కొత్త కండక్టర్లు వేస్తున్నామని విద్యుత్‌శాఖ అధికారులు తెలియజేస్తున్నారు. ఈ పనులను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర రైతు మీడియా కోఆర్డినేటర్ గింజుపల్లి వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు శివరామ ప్రసాద్‌తో పాటు పార్టీ నాయకులు బుధవారం కొబ్బరి కాయలు కొట్టి పనులను ప్రారంభించారు. దీంతో రామానగర్ కాలనీలో విద్యుత్ సమస్యలకు పూర్తి స్థాయిలో పరిష్కారం అవుతా యని విద్యుత్ ఏడీ గురునాథరావు తెలిపారు. అంతేగాకుంగా ప్రత్తిపాడులో మూడు ట్రాన్స్ ఫార్మర్స్‌ను కూడా మార్చుతున్నామన్నారు. కార్యక్రమంలో విద్యుత్ ఏఈ గౌతమ్, టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



విద్యుత్ స్తంభాలను మార్పిస్తున్న టీడీపీ రాష్ట్ర మీడియా కో ఆర్డినేటర్ గింజుపల్లి వెంకటేశ్వరరావు

బీసీల ఆర్థికాభివృద్ధికి సీఎం చంద్రబాబు కృషి

● కేసన శంకరరావు

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): బీసీల ఆర్థికాభివృద్ధికి సీఎం చంద్రబాబు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్య క్షుడు కేసన శంకరరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాలకు రాజకీయ, సామాజిక గుర్తింపుతోపాటు అన్ని రంగాల్లో నూ ప్రాధాన్యమిచ్చే లక్ష్యంతో స్వర్గీయ ఎన్టీఆర్ టీడీపీ స్థాపించారన్నారు. నాటి నుంచి నేటి వరకు బడుగుల అభివృద్ధి కోసం టీడీపీ కృషి చేస్తుంద న్నారు. బీసీల అభ్యున్నతి కోసం పెద్ద మొత్తంలో నిధులు కేటాయించడం, బీసీ హాస్టళ్ల అభివృద్ధికి చర్యలు తీసుకోవడం, ఈ ఏడాది 5,720 మంది బీసీ నిరుద్యోగులకు డీఎస్సీ శిక్షణ ఇప్పించడం హర్షణీయమన్నారు. ఈసారి జరిగే జనగణనతో పాటే కులగణన జరపాలని, జనాభా దామాషా ప్రకారం చట్ట సభల్లో, స్థానిక సంస్థల్లో, నామినేషన్ వర్కుల్లో రిజర్వేషన్లు అమలు జరపాల ని శంకరరావు కోరారు.

ఔషధ అభివృద్ధి చికిత్సా ఫలితాలపై అవగాహన సదస్సు




మహేష్‌కు జ్ఞాపికను బహూకరిస్తున్న ప్రిన్సిపాల్ రామారావు

తాడికొండ(లాం), ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఔషధ రూపకల్పన, చికిత్స ఫలితాల మధ్య అంతరాన్ని తగ్గించడంపై పరిశోధనలు ఎక్కువగా జరగాలని క్లింఫార్మేడ్ మేనేజింగ్ డైరెక్టర్ వీ మహేష్ అన్నారు. లాం చలపతి ఫార్మసీ కళాశాలలో బుధవారం బయో ఫార్మస్యూటిక్స్, ఫార్మాకోకినెటిక్స్‌లో పురోగతులు అనే అంశంపై ఒకరోజు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మహేష్ మాట్లాడుతూ ఆధునిక ఔషధ శాస్త్రంలో కొత్త ఔషధాలను రూపొందించడమంటే కేవలం ప్రభావంతమైన రసాయనపదార్థాన్ని కనుగొనడమే కాదు, శరీరంలో అదెలా పనిచేస్తుందో, ఎంత సమర్థవంతంగా అది లక్ష్య అవయవాన్ని చేరుతుందో చూడాలన్నారు. ఎటువంటి ఫార్ములేషన్ వాడితే ఎక్కువ ప్రయోజనం ఉంటుందో తెలపాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నాదెండ్ల రామారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రీసర్వేతో రైతులకు మేలు : తహసీల్దార్

కాకుమాను, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రీ సర్వే కార్యక్రమం ద్వారా రైతులకు మేలు జరుగుతుందని తహసీల్దార్ వెంకటస్వామి రైతులకు తెలియజేశారు. కాకుమాను పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన రీ సర్వేకు రైతులు సహకరించాలని సూచించారు. అలాగే సర్వేకు హాజరయ్యే రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్‌కార్డు, దస్తావేజులు, ఫొటో, బ్యాంక్ ఖాతా జిరాక్సులతో స్థానిక వీఆర్వోలను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ శివకుమారి, నల్లమోతు పూర్ణచంద్రరావు, రెవెన్యూ, సర్వే, పంచాయతీ శాఖల సిబ్బంది రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఫిరంగిపురం సీఐగా శివరామకృష్ణ



ఫిరంగిపురం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఫిరంగిపురం పోలీసుస్టేషన్‌కు నూతన సీఐగా కే శివరామకృష్ణ బుధవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. గతంలో గుంటూరు ట్రాఫిక్, దుగ్గిరాల, తెనాలి తాలూకా, సీఐడీ శాఖల్లో పని చేసి ఫిరంగిపురంనకు బదిలీపై వచ్చానని సీఐ తెలిపారు. శాంతి భద్రతలు, ట్రాఫిక్ సమస్యలను పరిష్కరిస్తామని ఆయన తెలి పారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.



ఎంటీఎంసీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న క్లాప్ ఆటో డ్రైవర్లు

మున్సిపల్ కార్మికులు, క్లాప్ ఆటో డ్రైవర్ల ధర్నా

మంగళగిరి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని కోరు తూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో క్లాప్ ఆటో డ్రైవర్లు, మున్సిపల్ కార్మికులు బుధవారం ఎంటీఎంసీ కార్యాల యం వద్ద ధర్నా నిర్వహించారు. యూనియన్ నేత ఎం రవి మాట్లాడుతూ ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న ఆప్కాస్‌ను రద్దు చేసి, కార్మికులను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఆప్కాస్‌ను తొలగించడం అనివార్యమైతే మున్సిపల్ కార్మి కులను పర్మినెంట్ చేయాలని కోరారు. కార్మికులు తమ సమస్యలు చెప్పుకు నేందుకు వస్తే ఎంటీఎంసీ కార్యాలయం లోపలకు రానివ్వకుండా గేట్లు మూసివేయడం విడ్డూరంగా ఉందన్నారు. క్లాప్ ఆటో డ్రైవర్లకు 16 నెలలుగా పెండింగ్ ఉన్న పీఎఫ్, ఈఎస్ఐ వారి ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చ రించారు. ఈ ధర్నాలో సీఐటీయూ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేతలు వీసం జవహర్‌లాల్, ఆర్ వేణు, బూరగ వెంకటేశ్వర్లు, పల్లె కృష్ణ, వెంగమ్మ, పిల్లలమర్రి బాలకృష్ణ, మంగయ్య, ఏసు, సుందరరావు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీఆదిరేణుకమ్మతల్లి, శ్రీపోతురాజుస్వామివార్ల ఆలయ పునఃప్రతిష్ఠ

దుగ్గిరాల, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): గొడవర్రులో శ్రీఆదిరేణుకమ్మతల్లి, శ్రీపోతురాజుస్వామివార్ల ఆలయ పునఃప్రతిష్ఠ మహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం 8.22 గంటలకు జరిగిన కార్యక్రమంలో పరిసర గ్రామాల ప్రజలు భారీగా పాల్గొన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, సర్పంచ్ విశ్వనాథపల్లి ఉమాదేవి, ఎంపీటీసీ శివకుమార్, ప్రసంగి కొండలు, నడకుదిటి నాగరాజు, బాపిరాజు, మంగళగిరి నియోజవర్గ వైసీపీ అధ్యక్షుడు దొంతిరెడ్డి వేమారెడ్డి, స్థానిక నాయకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సబ్సిడీపై వ్యవసాయ పనిముట్ల పంపిణీ



వ్యవసాయ పనిముట్లను పంపిణీ చేస్తున్న ఎంపీపీ జబీన్, కేసంనేని శ్రీఅనిత తదితరులు

దుగ్గిరాల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండలపరిషత్ కార్యాలయం ఆవరణలో జరిగిన వ్యవసాయ పనిముట్ల పంపిణీలో ఎంపీపీ జబీన్ పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ రైతులకు అవసరమైన వ్యవసాయ పని ముట్లను సబ్సిడీపై అందిస్తున్నారన్నారు. రూ.27వేల విలువచేసే థైవాన్ స్ప్రేయర్లను రూ.10వేల సబ్సిడీతో రైతులకు అందిస్తున్నారన్నారు. టీడీపీ మం డల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత మాట్లాడుతూ రైతులకు 50శాతం సబ్సిడీపై ట్రాక్టర్‌గొర్రులను, చెక్కగొర్రులను కూడా అందిస్తున్నారన్నారు. ఎంపీడీవో అడిగొప్పుల శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ వెనిగళ్ల శ్రీకృష్ణప్రసాద్, చింతలపూడి, ఈమని గ్రామాల సర్పంచులు తాడిబోయిన రామకృష్ణ, కేసంనేని వాసుబాబు, బీజేపీ నాయకులు చుండూరు ఉమామహేశ్వరరావు, కొంగర జోగేంద్రప్రసాద్, జనసేన మండల అధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాసరావు, కాజ భాస్కరరావు, ఈవో కె.వివేకానంద, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ మండల అధ్యక్ష పదవికి శ్రీరామ్మూర్తి రాజీనామా

దుగ్గిరాల, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కుప్పాల శ్రీరామ్మూర్తి తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈమని గ్రామానికి చెందిన శ్రీరామ్మూర్తి 40ఏళ్ల క్రితం కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం తీసుకున్న తాను ఈమని గ్రామపంచాయతీ వార్డు సభ్యుడిగా, సొసైటీ డైరెక్టర్‌గా, నీటి సంఘసభ్యుడిగా, యార్డుడైరెక్టర్‌గా పనిచేశారు. ఇటీవల కాలు విరిగి చికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటున్నానని, తన ఆరోగ్యపరిస్థితి తెలియజేసినప్పటికీ పార్టీ నుంచి ఏ ఒక్కరూ తనను పరామర్శించలేదని, ఆవేదన వ్యక్తం చేస్తూ రాజీనామా లేఖను పార్టీ నాయకులకు పంపినట్లు తెలిపారు.

భూమిలో కార్బన్ శాతం పెరిగేందుకు చర్యలు : ఏవో

కాకుమాను, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): భూమిలో కార్బన్ శాతం పెరగాలంటే పచ్చి రొట్ట పైర్లను సాగు చేసి కలియదున్నాలని మండల వ్యవసాయశాఖ అధికారి కిరణ్మయి అన్నారు. మండలపరిధిలోని వల్లూరు రైతు సేవాకేంద్రంలో బుధవారం పీఎండీఎస్ కిట్‌ల తయారీ విధానంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వీఏఏ హేమంత్, ఎంటీ శ్యామ్, యూనిట్ ఇన్‌చార్జి రజనీ, ఐసీఆర్పీ శివపార్వతి పాల్గొన్నారు.

పాడి రైతులకు బోనస్ పంపిణీ

కాకుమాను, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని కొండపాటూరు మిల్క్ ప్రొడ్యూసర్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం గ్రామానికి చెందిన 69 మంది పాడి రైతులకు రూ.1,23,550 బోనస్ పంపిణీ చేశారు. సంగం డెయిరీ డైరెక్టర్ గొల్లపూడి శ్రీనివాసరావు, దేవిరెడ్డి వెంకట సుబ్బయ్యలు పాల్గొని మాట్లాడుతూ పాడి రైతుల సంక్షేమం కోసం సంగం డెయిరీ నిరంతరం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో బాపట్ల ఏరియా జోనల్ మేనేజర్ తెల్లప్రోలు వీరేంద్రకుమార్, ముప్పవరపు సుధీర్‌బాబు, రూట్ సూపర్‌వైజర్ గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

'మణిపాల్‌లో' విజయవంతంగా కాలేయ మార్పిడి శస్త్రచికిత్స



వివరాలు వెల్లడిస్తున్న ప్రొఫెసర్ డాక్టర్ టామ్ చెరియన్

తాడేపల్లి టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మణిపాల్ హాస్పిటల్ - సౌత్ ఏషియన్ లివర్ ఇన్‌స్టిట్యూట్ భాగస్వామ్యంతో కాలేయ మార్పిడి శస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహించినట్లు మణిపాల్ హాస్పిటల్ లివర్ ట్రాన్స్‌ప్లాంట్ ప్రోగ్రాం హెడ్, ప్రఖ్యాత లివర్ సర్జన్ ప్రొఫెసర్ డాక్టర్ టామ్ చెరియన్ తెలిపారు. బుధవారం తాడేపల్లిలోని మణిపాల్ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లివర్ ట్రాన్స్‌ప్లాంట్ చేయించుకున్న 60 మంది రోగుల్లో 13 మంది కొత్త కాలేయ మార్పిడి ఎర్లీ రికవరీ ఆఫ్టర్ సర్జరీ నుంచి విజయవంతంగా ప్రయోజనం పొందారని వెల్లడించారు. మణిపాల్ హాస్పిటల్- సౌత్ ఏషియన్ లివర్ ఇన్‌స్టిట్యూట్ భాగస్వామ్యంతో మూడేళ్లుగా కోస్టల్ ఆంధ్రప్రదేశ్ ప్రజలకు సేవలు అందిస్తోందని హాస్పిటల్ క్లస్టర్ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ కంటిపూడి పేర్కొన్నారు. తక్కువ సమయంలోనే మణిపాల్ హాస్పిటల్ కాలేయ వ్యాధి చికిత్సకు అత్యుత్తమ కేంద్రంగా మారిందన్నారు. పిల్లల్లో అత్యధిక సంఖ్యలో కాలేయ మార్పిడి నిర్వహించిట్లు చెప్పారు. కొన్ని నెలల క్రితం పని చేయని కాలేయ క్యాన్సర్‌తో బాధపడుతున్న నాలుగేళ్ల బాలుడికి దాత కాలేయ మార్పిడిని విజయవంతంగాని నిర్వహించినట్లు తెలిపారు. సాధారణంగా కాలేయ మార్పిడి తర్వాత రోగిని 20 రోజుల్లో డిశ్చార్జి చేస్తారని కానీ ఇటీవల కాకినాడకు చెందిన లక్ష్మీ శ్రీనివాస్‌ను ఐదు రోజుల్లో డిశ్చార్జి చేశామని చెప్పారు. రోగి ఇంత త్వరగా కోలుకోవడం గొప్ప విషయమని సుధాకర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్యులు అరవింద్ రాజేష్, రాజేష్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

కేఎల్‌యూలో ముగిసిన అంతర్జాతీయ సదస్సు



జ్యోతి ప్రజ్వలనలో పాల్గొన్న అతిథులు

తాడేపల్లి (వడ్డేశ్వరం), ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్సిటీలో ఎమర్జింగ్ ఎలక్ట్రానిక్ సస్టయినబులిటీ అంతర్జాతీయ సదస్సు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఐఆర్డీ, ఈఎల్‌జీఈ ఎండీఐఈ, ఈసీఈ నాలుగు విభాగాలు సంయుక్తంగా నిర్వహించిన ఈ సదస్సుకు చెన్నై అన్నా యూనివర్సిటీ డీన్ డాక్టర్ జయవేల్ ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రసంగించారు. నానో మెటీరియల్స్ వినియోగం ద్వారా పర్యావరణ హితం కలిగించే ఎలక్ట్రానిక్స్ తయారీపై దృష్టి పెట్టాలన్నారు. ఎనర్జీ స్టోరేజి, ట్రాన్స్‌సిస్టర్‌లపై ఫోకస్ చేయడం వంటి అంశాలు ఆకట్టుకున్నాయి. ఏఎస్ వర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ వి.రాజేంద్రన్ మాట్లాడుతూ పర్యావరణ మార్పులకు అనుగుణంగా తట్టుకునే వ్యవస్థలు అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వడోదర జీఎస్ఎఫ్‌సీ యూనివర్సిటీ వీసీ డాక్టర్ జీఆర్ సిన్హా, కేఎల్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ఐఆర్డీ విభాగాధిపతి డాక్టర్ విశ్వనాథ షెనోయ్, వీసీ సారథివర్మ, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ ఎం సుమన్, ఐఆర్డీ అసోసియేట్ డాక్టర్ వి.వివేకానందన్, ఈఎల్‌జీఈ అసోసియేట్ డాక్టర్ అరుణ్ మేథ పాల్గొన్నారు. దేశ విదేశాల నుంచి 400లకు పైగా పరిశోధనా పత్రాలు రాగా 225 ఎంపికయ్యాయి.

లక్షమల్లెల పూజతో ప్రారంభమైన ఉత్సవాలు

● భక్తులతో కిక్కిరిసిన కొండపాటూరు

కాకుమాను, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మహిమాన్విత పుణ్యక్షేత్రం. కోరిన కోర్కెలు తీర్చే భక్తుల కొంగు బంగారం .. కొండపాటూరు స్వయంభు శ్రీపోలేరమ్మ తిరునాళ్లకు లక్షమల్లెల పూజతో అంకురార్పణ జరిగాయి. మంగళవారం రాత్రి అమ్మవారికి లక్షమల్లెల పూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయం ముందు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ కమిటీ చైర్మన్ ముత్తినేని అనీల్‌కుమార్ దంపతులు, ఆలయ కార్యనిర్వహణ అధికారి సురేష్‌బాబుతో పాటు వేలాది మంది దంపతులు అమ్మవారి లక్షమల్లెల పూజలో పాల్గొన్నారు. ఆలయం వద్ద భక్తులు పూజల్లో పాల్గొనేందుకు ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అమ్మవారికి మల్లెల పూజ సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఈ పూజ కార్యక్రమాన్ని వీక్షించేందుకు బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ నెల 18న శుక్రవారం కుంకుమ పూజ, 22న శిడిమాను మహోత్సవం, తిరునాళ్ల జరుగుతుందని ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ ముత్తినేని అనీల్‌కుమార్, ఆలయ ఈవో సురేష్‌బాబు తెలిపారు.

రేపటి నుంచి ఆహ్వాన నాటిక పోటీలు

పెదనందిపాడు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఈ నెల 18, 19, 20వ తేదీల్లో ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటికపోటీలు నిర్వహించనున్నట్లు అధ్యక్ష, గౌరవాధ్యక్షులు ముద్దన రాఘవయ్య, పోపూరి నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని వరగానిలో ఆంధ్రరాష్ట్ర సృజనాత్మక, సంస్కృతి సమితి సౌజన్యంతో లావు వెంకటేశ్వర్లు, కె.నాగేశ్వరావు కళాపరిషత్ ఆధ్వర్యంలో జరుగుతాయన్నారు.

సమర్థంగా స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర

డీఎల్పీవో కె.శ్రీనివాసరావు

పెదనందిపాడు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని అధికారులు సమర్థంగా నిర్వహించాలని డీఎల్పీవో కె.శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఇంటి పన్నుల బకాయి మే 15 లోపు వసూలు చేయాలని, కుళాయిపన్ను బకాయి చెల్లించకుంటే డమ్మీలు వేయాలని ఆదేశించారు. వసూలుచేసిన నగదు స్వర్ణపంచాయతీ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో జమచేయాలని సూచించారు. ఈ నెల మూడో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ కార్యాలయాల్లో ఈవేస్టేజీని సేకరించి, సంపద సృష్టి కేంద్రాలకు తరలించాలని తెలిపారు. ఇటీవల ప్రజావేదికలో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని పెదనందిపాడుకు చెందిన నూతి శ్రీనివాసరావు ఇచ్చిన అర్జీని పరిశీలించి, రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు ఎంపీడీవోకు ఆదేశాలు జారీచేశారు. అనంతరం కూటమి నాయకులు డీఎల్పీఓను కలిసి అప్పాపురం పైలెట్ ప్రాజెక్ట్ ద్వారా తాగునీటిసరఫరా చేసేలా చర్యలు చేపట్టాలని, గ్రామంలో పారిశుధ్యం, వీధి దీపాల సమస్యల పరిష్కారానికి విన్నవించారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

నేడు విద్యుత్ అదాలత్

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 17న పొన్నూరులో విద్యుత్ వినియోగదారులు సమస్యల పరిష్కారం కోసం విజయవాడ సీజీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో వినియోగదారుల అదాలత్ నిర్వహిస్తున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ జీ భాస్కరరావు బుధవారం తెలిపారు. మండల పరిధిలోని దొప్పలపూడి క్రాస్ రోడ్డు వద్ద గోవాడ చౌదరి ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10నుంచి జరిగే ఈ అదాలత్‌లో సీజీఆర్ఎఫ్ సభ్యులు, విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు, హాజరవుతారని చెప్పారు. విద్యుత్‌శాఖ వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

తెనాలి రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): తెనాలి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు కార్యాలయ ఏవో ఆచంట శ్రీనివాసరావు తెలిపారు. మధ్యాహ్నం గం.2.30నిలకు అధ్యక్షుడు ధర్మరాజుల చెన్నకేశవులు అధ్యక్షతన సమావేశం ప్రారంభమవుతుందని సభ్యులు, అధికారులు హాజరై జయప్రదం చేయాలని ఓ ప్రకటనలో కోరారు.

కాంగ్రెస్ నేతలపై చార్జిషీట్ అప్రజాస్వామికం: అందే

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు, రాహుల్, సోనియా గాంధీలపై బీజేపీ నేతలు చార్జిషీట్ దాఖలు చేయడం అప్రజాస్వామికం అని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అందే దిలీప్ బుధవారం ఆరోపించారు. పసలేని నేషనల్ హెరాల్డ్ కేసులో చార్జిషీటు దాఖలు చేయడమే కాకుండా ఆస్తులు జప్తు చేశారన్నారు. నేషనల్ హెరాల్డ్ పత్రిక స్వాతంత్ర్య సంగ్రామంలో జాతి గొంతుకై నిలిచిందన్నారు. ఈ సంస్థకు ఆర్థిక ఇబ్బందులు రావడంతో కాంగ్రెస్ పార్టీ యంగ్ ఇండియా సంస్థతో రూ.90కోట్ల రుణాన్ని సమకూర్చి ఉద్యోగుల జీతభత్యాలు చెల్లిందన్నారు కేవలం రాహుల్ గాంధీ గొంతు నొక్కేందుకు బీజేపీ నేతలు కాంగ్రెస్ నేతలపై చార్జిషీటు దాఖలు చేశారని అందే దిలీప్ ఆరోపించారు. బీజేపీ కుటిల పన్నాగాలను ప్రజల వద్దకు తీసుకువెళ్లి పోరాడనున్నట్లు దిలీప్ వెల్లడించారు.

వర్మీ కంపోస్టు ఎరువుల తయారీలో జాగ్రత్తలు పాటించాలి: డీఎల్‌పీవో

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వర్మీ కంపోస్టు తయారీలో జాగ్రత్తలు పాటించాలని తెనాలి డివిజనల్ లెవల్ పంచాయతీ ఆఫీసర్ స్వరూపారాణి అన్నారు. మండల పరిధిలోని వడ్లమూడిలో బుధవారం సంపద సృష్టి కేంద్రాన్ని డీఎల్‌పీవో స్వరూపరాణి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తడిచెత్త నుంచి తయారయ్యే సెమీ కంపోస్టును వానపాముల ఎరువు తయారీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చెత్తనుంచి ఆదాయం సృష్టించే మార్గాల గురించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుభాష్ చంద్రబోస్, స్వచ్ఛ భారత్ మిషన్ కో ఆర్డినేటర్ క్లాప్ మిత్రాలు పాల్గొన్నారు.

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక బోసురోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహం సమీపంలో అన్నదాత సుఖీభవ సంఘ సభ్యులు నిర్వహిస్తున్న వేసవి చలివేంద్రంలో చల్లని మజ్జిగను పంపిణీ చేశారు. బుధవారం అన్నదాత సుఖీభవ సంఘ సభ్యులు గుమ్మడి వెంకటరమణ, మాధవి దంపతుల సహకారంతో పాదచారులకు చల్లని మజ్జిగ, తాగునీరును పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు డాక్టర్ శ్రీనివాసరావు, అబ్దుల్ రజాక్, వాసు, గుమ్మడి నారాయణరావు, ప్రదీప్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల హాజరు నమోదుకు కొత్త యాప్

తెనాలి అర్బన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలు, ఉపాధ్యాయుల వివరాల కోసం ఉన్న యాప్‌లన్నింటిని కేంద్రీకరించి ఒకే యాప్ చేస్తామన్న కూటమి ప్రభుత్వం కొత్త యాప్‌ను విడుదల చేసింది. లీప్ పేరిట ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు నమోదుతో పాటు పలు యాప్‌లను ఇందులో పొందుపరిచారు. బుధవారం నుంచి ప్రవేశపెట్టిన ఈ యాప్ వెంటనే పని చేయడం ఉపాధ్యాయులకు ఊరటనిచ్చింది. ప్రస్తుతం ఉన్న స్కూల్ అటెండెన్స్ యాప్‌ను తొలగించి ఆ స్థానంలో లీప్ యాప్‌ను ప్రవేశ పెట్టారు. గూగుల్ ప్లే స్టోర్, లింకుల ద్వారా డౌన్‌లోడ్ చేసుకున్న ఉపాధ్యాయులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా హాజరు నమోదు చేసుకోగలిగారు. ఎట్టకేలకు యాప్‌లన్నీ కేంద్రీకృతం చేసే దిశగా విద్యాశాఖ కసరత్తు మొదలు పెట్టింది. గత మూడు నెలలుగా టాయిలెట్ల ఫొటోలు తీసేపని ఉపాధ్యాయులకు తప్పించి సచివాలయ ఉద్యోగులకు అప్పగించింది. దీంతో ఉపాధ్యాయులకు బోధనేతర పనులు తప్పించి పూర్తిస్థాయిలో బోధనపై దృష్టి సారించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం విద్యారంగ అభివృద్ధికి దోహదపడుతుందని ఉపాధ్యాయ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మాజీ కౌన్సిలర్ సూర్యదేవరకు ఘన నివాళి

తెనాలి అర్బన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చినరావూరుకు చెందిన మాజీ కౌన్సిలర్ సూర్యదేవర సాంబశివరావు వర్థంతి బుధవారం నిర్వహించారు. బోసురోడ్డులోని స్మారక స్థూపం వద్ద పలువురు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు అభిమానులు ఆయన పట్టణానికి అందించిన సేవలను గుర్తు చేశారు. మాజీ కౌన్సిలర్ శశికళ, రవికుమార్, శ్రీనివాస్, బుల్లబ్బాయి, ప్రసాద్, జగన్, వెంకయ్య, రాఘవ, సులోచన, మీరావలి పాల్గొన్నారు.

పేదలకు దుస్తులు, బియ్యం పంపిణీ

తెనాలి అర్బన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రూరల్ మండల కొలకలూరు కాల్వ కట్టలపై నివసిస్తున్న పేదలకు బుధవారం దుస్తులు, బియ్యం పంపిణీ చేశారు. స్వచ్ఛంద సంస్థ సహకారంతో నిర్వహించిన కార్యక్రమంలో సినీ దర్శకుడు దిలీప్‌రాజా, రావూరి అంజలి పాల్గొన్నారు.

ఆయిల్ ట్యాంకర్ బోల్తా

అప్రమత్తతతో తప్పిన పెను ప్రమాదం



నారాకోడూరు పాఠశాల వద్ద బోల్తాపడిన ఆయిల్ ట్యాంకర్, అనంతరం ట్యాంకర్‌ను లేపి ఫోమింగ్ చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లా కొండపల్లి నుంచి చీరాల వెళుతున్న పెట్రోలు ట్యాంకర్ చేబ్రోలు మండలం నారాకోడూరు గ్రామం వద్ద బోల్తాపడింది. ఆయిల్ ట్యాంకర్ అదుపుతప్పి బోల్తా పడడంతో నారాకోడూరు గ్రామంలో భయాందోళనలు ఏర్పడ్డాయి. నారాకోడూరు గ్రామం వద్ద జడ్పీ హైస్కూల్ ముందు ఇటీవల ప్రమాదాల నివారణకు స్పీడ్ బేకర్‌లను ఏర్పాటు చేశారు. స్పీడ్ బ్రేకర్ దాటే సమయంలో ఆయిల్ ట్యాంకర్ యాక్సిల్ విరిగిపోవడంతో ట్యాంకర్‌అదుపు తప్పి బోల్తాపడింది. ట్యాంకర్ నిండా పెట్రోలు ఉండడంతో పెట్రోల్ లీక్ అయింది. అయితే ఈ ప్రమాద సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి తరలివచ్చి అక్కడ గుమి కూడిన ప్రజలను తక్షణమే ఆ ప్రాంతం నుంచి పంపించి వేశారు. అగ్నిమాపక శాఖ సిబ్బంది సంఘటన స్థలానికి వచ్చి ట్యాంక్ లీకేజ్‌ను అరికట్టడమే కాకుండా పెట్రోలు ప్రవహించిన మార్గం అంతా మంటలు వ్యాపించకుండా రసాయనాలు, ఫోమ్, వెదజల్లారు. ట్యాంకర్‌లో ఉన్న పెట్రోలును వేరే ట్యాంక్‌లోకి మళ్లించే ప్రయత్నం చేశారు. ఆయిల్ ట్యాంకర్ బోల్తాపడిన సమయంలో ఎటువంటి నిప్పు రవ్వలు రాజుకోకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ట్యాంకర్ బోల్తాపడిన వెంటనే నిప్పురవ్వలు చెలరేగి ఉంటే ఆ ప్రదేశం అంతా భస్మీపటలం అయి ఉండేదని స్థానికులు వెల్లడించారు. పొన్నూరు రూరల్ సీఐ కోటేశ్వరరావు చేబ్రోలు పొన్నూరు ఎస్‌ఐలు వెంకట కృష్ణ, కిరణ్ సంఘటన స్థలానికి చేరుకుని స్థానికులను ఆ ప్రదేశం నుంచి ఖాళీ చేయించారు. ప్రమాదంపై చేబ్రోలు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాఫిక్ మళ్లింపు

జీబీసీ రోడ్డుపై నారాకోడూరు వద్ద పెట్రోలు ట్యాంకర్ బోల్తా పడడంతో గుంటూరు నుంచి పొన్నూరు వైపు వచ్చే వాహనాలను పలు రూట్లలో మళ్లించినట్లు చేబ్రోలు పోలీసులు బుధవారం తెలిపారు. పొన్నూరు నుంచి గుంటూరు వైపు వచ్చే వాహనాలు చేబ్రోలు, వడ్లమూడి మీదుగా, గుంటూరు నుంచి బాపట్ల, చీరాల, రేపల్లె వెళ్లే వాహనాలు తెనాలి మీదుగా మళ్లించినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలియజేశారు.

నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికే గ్రీవెన్స్

● ఎమ్మెల్సీ ఆలపాటి

తెనాలి రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకుని వాటిని సత్వరమే పరిష్కరించేందుకు గ్రీవెన్స్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ చెప్పారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ నియోజకవర్గంలో పలువురు ప్రజల నుంచి వివిధ సమస్యలతో కూడిన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా రేషన్ కార్డులు, పింఛన్ల వంటి పలు సమస్యలను ప్రజలు ఆలపాటికి వివరించారు. సంబంధిత సమస్యలపై ఆయా శాఖల అధికారులతో ఆలపాటి ఫోన్‌లో మాట్లాడి సత్వర పరిష్కారానికి కృషిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వాన్ని పెద్దఎత్తున ఆశీర్వదించిన ప్రజలకు మంచి చేయాలన్న ఉద్దేశంతో ప్రతి బుధవారం గ్రీవెన్స్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. నియోజవర్గ వ్యాప్తంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకుని వాటిని పరిష్కరించడం జరుగుతుందన్నారు. ప్రజా ప్రతినిధులంటే ప్రజల్లో ఒకరన్న భావన్న ప్రతి ఒక్కరిలో ఉండేలా ఇటువంటి మంచి కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్తున్నట్లు స్పష్టం చేశారు. పలువురు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

ఆలస్యంగా సదరం రీ వెరిఫికేషన్ ప్రారంభం

● ఆర్థోవిభాగం వైద్యుడు రాకపోవడంతో దివ్యాంగుల నిరీక్షణ ● 11.45కు పరీక్షలు

తెనాలి రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో వారంలో మూడు రోజులు నిర్వహించే సదరం రీ వెరిఫికేషన్ బుధవారం ఆర్థోవిభాగంలో ఆలస్యంగా ప్రారంభమైంది. ఉదయం 9.30 నుంచి పరీక్షలు ప్రారంభం కావాల్సి ఉంది. ఐతే సంబంధిత వైద్యుడు సకాలంలో హాజరు కాకపోవడంతో జాప్యం చోటుచేసుకుంది. ఆర్థో విభాగంలో పరీక్షలంటే తప్పనిసరిగా బాధితుడితోపాటు మరో సహాయకుడు అవసరం ఉంటుంది. సమయపాలన పాటించకపోవడంతో వైద్యుని కోసం ఎదురుచూడక తప్పలేదు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు కావడం, అందులో దివ్యాంగులవడంతో వైద్యుని కోసం వార్డు వద్దే పడిగాపులు కాస్తూ ఇబ్బందులకు గురయ్యారు. అక్కడ ఉన్న సచివాలయ ఉద్యోగులను పలుమార్లు ప్రశ్నించినప్పటికీ వారికి మరికొద్దిసేపట్లో ప్రారంభిస్తామంటూ దాదాపుగా మధ్యాహ్నం 11.50 నిముషాలవరకూ వేచి ఉన్నారు. ఆ సమయంలో వచ్చిన వైద్యుడు హడావిడిగా రీ వెరిఫికేషన్ ప్రక్రియను ప్రారంభించారు. ఆసుపత్రిలో ఈ రీ వెరిఫికేషన్ ప్రక్రియను పర్యవేక్షించాల్సిన సూపరింటెండెంట్, ఆర్ఎంవో వంటివారు అందుబాటులో లేకపోవడంతో దివ్యాంగులు ఎవ్వరికి తమ సమస్యను చెప్పుకోవాలో అర్థంకాక వైద్యుడు వచ్చేవరకూ వేచి ఉన్నారు. వైద్యశాలలో పర్యవేక్షణలోపంతోనే ఇటువంటి సమస్యలు తలెత్తుతున్నాయని ఇకనైనా ఇటువంటి సమస్యలు ఉత్పన్నమవ్వకుండా సమయపాలన పాటించేలా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టిపెట్టాలని పలువురు కోరుతున్నారు.




వైద్య పరీక్షల కోసం వచ్చిన దివ్యాంగులు

తక్కెళ్లపాడు వాటర్ ప్లాంట్‌ను సందర్శించిన వైద్య విద్యార్థులు

గుంటూరు మెడికల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): గుంటూరు మెడికల్ కళాశాల ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు తక్కెళ్లపాడులోని వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను బుధవారం సందర్శించారు. నాలుగేళ్ల విరామం అనంతరం ప్రిన్సిపాల్ సహకారంతో వైద్య విద్యార్థులకు క్షేత్రస్థాయి పర్యటనకు అవకాశం లభించింది. జీఎంసీ 1999వ బ్యాచ్ విద్యార్థులు విరాళమిచ్చిన కాలేజ్ బస్సులో ఫీల్డ్ విజిట్ సాధ్యమైంది. విద్యార్థులు వాటర్ ప్లాంట్‌లో సెడిమెంటేషన్, రాపిడ్ శాండ్ ఫిల్టర్, క్లోరినేషన్ వంటి ప్రక్రియలను ప్రత్యక్షంగా పరిశీలించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ బోధన

పొన్నూరు టౌన్, (చేబ్రోలు) ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ విద్యా బోధన చేస్తున్నట్లు డిప్యూటీ కలెక్టర్ చంద్రముని తెలిపారు. మండల పరిధిలోని వేజెండ్లలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థుల ఆధ్వర్యంలో బుధవారం ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న అధికారులు గ్రామంలో ఇంటింటికి పర్యటించి ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న సౌకర్యాల గురించి అవగాహన కల్పించారు. ఐదుగురు నూతన విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చేరినట్లు హెచ్ఎం విజయశ్రీ తెలిపారు. ర్యాలీలో ఎంఈవో రాయల సుబ్బారావు, శ్రీనివాసమూర్తి, లక్ష్మీ పద్మావతి, దీప్తి, నస్రీన్, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పరీక్షిస్తున్న ఎంఈవో

విద్యార్థులకు ప్రణాళికాబద్ధంగా విద్యను అందించాలి: ఎంఈవో

కొల్లిపర, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రణాళికాబద్ధంగా విద్యను అందించాలని ఎంఈవో సాల్మన్‌రాజు అన్నారు. బుధవారం మండల పరిధిలోని అన్నవరంలంక, బొమ్మువానిపాలెం ప్రాథమిక పాఠశాలలను ఆయన తనిఖీ నిర్వహించారు. పాఠశాలల్లో రికార్డులను, విద్యార్థుల హాజరు పట్టీలను పరిశీలించారు. ఉపాధ్యాయులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా సాల్మన్‌రాజు మాట్లాడుతూ సమయపాలన పాటించడతో పాటు విద్యార్థులకు మెరుగైన విద్య ను అంధించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. మధ్యాహ్నభోజన పథకాన్ని కూడ సక్రమంగా అమలు చేయాలన్నారు.

లైంగిక వేధింపులపై పోక్సో కేసు నమోదు

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఒక బాలికను కిడ్నాప్ చేసి లైంగిక వేధింపులకు గురిచేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. ఈ నెల 14న సాయంత్రం మండలంలో దుగ్గిరాల గ్రామానికి చెందిన రవి బుర్రిపాలెం రోడ్డులో సైకిల్‌పై వెళ్తున్న బాలికను బెదిరించి, శివారు పొలాల్లోకి తీసుకువెళ్లి లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. బాలిక కేకలు వేయడంతో పరిసర ప్రాంత ప్రజలు రావడం గమనించి బాలికను వదలి పరారయ్యాడు. ఘటనపై బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ పోలీసులు తెలిపారు.



దశావతార సన్నిధిలో జరిగిన పూజల్లో పాల్గొన్న భక్తులు

దశావతారుని సన్నిధిలో ప్రత్యేక పూజలు

పెదకాకాని, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఏఎన్‌యూ ఎదుట ఉన్న దశావతార వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. మహాగణపతి స్వామికి సంకటహర చతుర్థి వ్రతాలు జరిపించారు. ఆలయ ధర్మకర్త లింగమనేని పూర్ణ భాస్కరరావు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉంటే అగ్ని ప్రమాదాల నివారణ: ప్రసాదరావు

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 16: గృహిణులు వంట చేసే సమయంలో అప్రమత్తంగా వ్యవహరిస్తే ప్రమాదాలను సమర్థంగా నివారించవచ్చని ఫైర్ ఆఫీసర్ ప్రసాదరావు తెలిపారు. పొన్నూరు పట్టణంలోని పలు అపార్టుమెంట్‌లలో బుధవారం అగ్నిమాపక శాఖ అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా మహిళలకు వంటింటిలో చెలరేగే మంటలను ఎలా అదుపు చేయాలో వివరించారు.

● తెనాలి క్రైం, ఏప్రిల్ 16: వంట గదిలో గ్యాస్ ప్రమాదాలు జరగకుండా మహిళలు అప్రమత్తంగా ఉండాలని తెనాలి ఫైర్ స్టేషన్ అధికారి కె.కోటిరెడ్డి పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో మూడో రోజు పట్టణంలోని సింధుప్రియ అపార్ట్‌మెంట్‌తో పాటు వివిధ అపార్ట్‌మెంట్స్‌లో బుధవారం వంట ఇంటిలో జరిగే గ్యాస్ లీకేజీలు, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కోటిరెడ్డి మాట్లాడుతూ వంట గదిలో గాలి, వెలుతురు ఉండే విధంగా చూడాలి తెలిపారు. వంట సమయంలో దుస్తులకు నిప్పు అంటుకుంటే పరుగులు తీయకూడదని, వెంటనే నేలపై దొర్లడం లేదా రగ్గు, దుప్పటి కప్పుకోవడం చేయాలన్నారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

● అంగన్‌వాడీ సూపర్‌వైజర్ యామిని

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు పోషకాహారం తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ యామిని అన్నారు. మండలంలోని బుర్రిపాలెంలో బుధవారం అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కె.యామిని ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింత మహిళలకు పౌష్టికాహారం పక్షోత్సవ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1000 రోజులు గర్భిణులు తీసుకోవాల్సిన ఆహారం, విశ్రాంతి, చేయవలసిన వ్యాయామం గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. బాలింతలు తీసుకోవలసిన ఆహారం, రెండు సంవత్సరాల పిల్లలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం గర్భిణుల బరువులను నమోదు చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త శ్రీలక్ష్మి, గర్భిణులు, బాలింతలు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు, లారీ ఢీ: ఇద్దరికి స్వల్పగాయాలు

తెనాలిరూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంగంజాగర్లమూడి ప్రధాన రహదారిపై ఆర్టీసీ బస్సు, లారీ ఢీకొన్న ఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. తెనాలి నుంచి సంగం జాగర్లమూడి మీదుగా గుంటూరు వెళ్లే పల్లెవెలుగు బస్సు, గుంటూరు నుంచి కంకర లోడ్‌తో తెనాలి వైపు వెళ్తున్న లారీ సంగంజాగర్లమూడి సెంటర్ ప్రధాన మలుపులో క్రాస్ చేసే క్రమంలో లారీ సైడ్ ఇనుప ఊగ్గిలు తగలడంతో బస్సు కిటికీలు పగిలి ఇద్దరికి గాయాలయ్యాయి. రూరల్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

తెనాలి రూరల్, ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): మానసిక స్థితి సరిలేని వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్‌ఐ ఆనంద్ బుధవారం తెలిపారు. నందివెలుగు జామవానగర్‌కు చెందిన కొత్తపల్లి రమేష్ మానసిక స్థితిసరిగా లేక చైన్నె నుంచి వైద్యం పొందుతూ నందివెలుగులోని అన్న ఇంట్లో ఉంటున్నాడు. ఈ నెల 9న ఇంటి నుంచి బయటకు వెళ్లిన అతను తిరిగి రాలేదు. తెలిసిన వారిని, పరిసర ప్రాంతాల్లో విచారించిన ఆచూకీ లభించలేదు. వ్యక్తిని గుర్తిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. అతడి సోదరుడు కొత్తపల్లి దీనదయాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సమాజాన్ని చైతన్యపరిచే రచనలు అవసరం: ఫణిరాందేవ్

తెనాలి అర్బన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): సమాజాన్ని చైతన్యపరిచే రచనలు అవసరమని కమ్యూనిస్టు నాయకుడు మోపిదేవి ఫణిరాందేవ్ పేర్కొన్నారు. కవిరాజా పార్కులో బుధవారం ముట్టడి పుస్తకాన్ని ఆవిష్కరించారు. భూస్వామ్య వ్యవస్థ విముక్తి కోసం పోరాడే వారికి బాసటగా నిలిచిన నాటకానికి పుస్తకమే దోహదపడిందన్నారు. సమాజంలో అసమానతలను తొలగించేందుకు ఆదర్శంగా జీవించేందుకు నాటక ప్రదర్శన ఆలోచింపజేస్తుందన్నారు. సినీ దర్శకుడు దిలీప్‌రాజా, బాబురావు, సీతారామయ్య, రచయిత ప్రకాష్, బొల్లిముంత కృష్ణ, అబ్రహం లింకన్, కృష్ణారావు, ఉమ, గరికపాటి సుబ్బారావు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తకు నివాళి

పొన్నూరుటౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కసక్రరుకు చెందిన టీడీపీ కార్యకర్త కొండేపు చెంచయ్య బుధవారం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ చెంచయ్య కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించారు. చెంచయ్య మృతదేహాన్ని టీడీపీ సీనియర్ నాయకుడు ఎం.వెంకటేశ్వరరావు, బి.బాబూరావు, సి.సీతారామయ్య, బి.బాపనయ్య, సుబ్బారావు, ప్రసాద్ సందర్శించి నివాళులర్పించారు.

పారిశుధ్య పనులలో అలసత్వం సహించను

● మున్సిపల్ కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో జరుగుతున్న పారిశుధ్య పనుల్లో అలసత్వం వహిస్తే సహించనని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న హెచ్చరించారు. బుధవారం నందులపేట డాంగే వారి వీధిలో జరుగుతున్న శానిటేషన్ పనులను అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎంఈ ఆకుల శ్రీనివాసరావు, డీఈ శ్రీనివాసులు, ఏఈ సునీల్‌కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



అధికారులకు సూచనలు చేస్తున్న కమిషనర్ శేషన్న, ఎంఈ శ్రీనివాసరావు, డీఈ శ్రీనివాసులు తదితరులు

ప్రణాళికాబద్ధంగా విద్యను అభ్యసించాలి

● ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా విద్యను అభ్యసించినపుడే ఉన్నత శిఖరాలను చేరుకుంటారని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక కొత్తపేటలోని టీడీపీ పార్టీ కార్యాలయంలో జాతీయ స్థాయిలో నిర్వహించిన ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ పరీక్షలో ప్రతిభ చూపిన శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు అడుసుమల్లి లోహిత, కోసూరి సాయి సాధిఖ్‌లకు ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ట్యాబ్‌లను అందించి అభినందించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ లక్ష్మీపతిరావు, ఏజీఎం ఎన్.అంజయ్య, ఆర్ఐ జి అప్పాజి, కో ఆర్డినేటర్లు పి.గోపిచంద్, గౌరీశంకర్, ఉపాధ్యాయ బృందం, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.



విద్యార్థినికి ట్యాబ్‌ను అందిస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి తదితరులు

గీతాంజలి కుటుంబ సభ్యులను ఆదుకుంటాం

● మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

తెనాలి రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్న గీతాంజలి కుటుంబ సభ్యులను అన్ని విధాల ఆదుకుంటామని మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. ఇటీవల వైసీపీ ప్రభుత్వంలో తెనాలికి చెందిన గీతాంజలి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. బుధవారం మృతిరాలి భర్తను, ఇరువురు పిల్లలను మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, రాష్ట్ర వైసీపీ సోషల్ మీడియా సభ్యులు కలసి పరామర్శించి వారికి రూ. 50వేలు నగదును అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర వైసీపీ సోషల్ మీడియా ప్రతినిధులు దొడ్డ అంజిరెడ్డి, ప్రేమకుమార్, యస్వంత్ రెడ్డి, వెంకట్రామిరెడ్డి, షేక్ జావేద్, పలువురు వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మృతురాలు గీతాంజలి కుటుంబ సభ్యులకు రూ.50 వేలు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే శివకుమార్

పౌష్టికాహారంతో వ్యాధినిరోధక శక్తి

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): క్రమం తప్పకుండా పౌష్టికాహారం స్వీకరించడం ద్వారా వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని సీడీపీవో వెంకటరమణ అన్నారు. బుధవారం పట్టణంలో 12వ వార్డు జై భారతరెడ్డి నగర్‌లో పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి పౌష్టికాహార ప్రాముఖ్యత వివరించారు. గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలు క్రమం తప్పకుండా ఆకుకూరలు, పండ్లు, పాలు, కోడిగుడ్లతో పాటు చిరుధాన్యాలు స్వీకరించడం ద్వారా రక్త హీనత తగ్గి ఆరోగ్యంగా ఉంటారన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్యామల, అంగన్‌వాడీ కార్యర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ

కొల్లిపర, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తూములూరు గ్రామ పంచాయతీ వద్ద బుధవారం సర్పంచ్ బాణావత్ అరుణాబాయ్ అధ్యక్షతన అధికారులు గ్రామసభ నిర్వహించారు. గ్రామసభలో అధికారులు ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తూములూరు నుంచి కొత్తబొమ్మువానిపాలెం వెళ్లే రోడ్డు మార్గంలో కొంతమంది వ్యక్తులు మద్యం సేవించి రోడ్లపైన మద్యం సీసాలు పగలు కొట్టి రైతులను పలు ఇబ్బందులను గురిచేస్తున్నారని వారిపై తగిన చర్యలు తీసుకోవాలని రైతులు అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం విద్యాకమిటీ చైర్మన్ బొమ్ము శ్రీలక్ష్మి ఇచ్చిన క్రీడా దుస్తులను అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ భార్గవ్, ఉపసర్పంచ్ ఆరిమళ్ళ శివారెడ్డి, గ్రామపెద్దలు మర్రెడ్డి బ్రహ్మారెడ్డి, కొండా కిశోర్‌రెడ్డి, కట్టా శ్రీహరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

14 మంది జూదరుల అరెస్టు

పెదకాకాని, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పేకాడుతున్న 14మందిని అరెస్టు చేసినట్లు బుధవారం పెదకాకాని పోలీసులు తెలిపారు. పోలీసులు కథనం ప్రకారం గుంటూరు నగరానికి చెందిన వీరంతా అగతవరపాడు సమీపంలోని ఒక ఇంట్లో పేకాటడుతున్నట్లు సమాచారం రాగా పోలీసులు వీరిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ.46,150 నగదు స్వాధీనపరచుకొని, నిందితులను అరెస్టు చేసినట్లు పెదకాకాని పోలీసులు పేర్కొన్నారు.

కందుకూరికి ఘన నివాళి

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 16: తెలుగుజాతి గర్వించదగ్గ మహోన్నత వ్యక్తి కందుకూరి వీరేశలింగం పంతులు అని ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు కొనియాడారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో బుధవారం కందుకూరి వీరేశలింగం పంతులు 177వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. కందుకూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజా నాట్యమండలి సభ్యులు లోహిత్‌కుమార్, శ్రీనివాసరావు, జాన్‌వలి, నరసింహమూర్తి, అంకమయ్య పాల్గొన్నారు.